Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 223 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, గురువారం11-09-2025 పేజీలు : 12 వెల : 2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

- రెండు రోజులుగా నేపాల్‌ను కుదిపేస్తున్న హింసాత్మక నిరసనలు
- భారత్-నేపాల్ సరిహద్దులో హై అలర్ట్ ప్రకటించిన కేంద్ర ఏజెన్సీలు
- నేపాల్ అల్లర్లను ఆసరాగా చేసుకుని చొరబాట్లకు ఆస్కారం
- ఉత్తరాఖండ్, యూపీ, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో భద్రత కట్టుదిట్టం
- సరిహద్దుల్లో ఎస్ఎస్‌బీ, పోలీసు బలగాల నిరంతర గస్తీ బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు

## నేపాల్‌లో అల్లర్లు.. భారత్ సరిహద్దులో

# హై అలర్ట్

**పొరుగు దేశమైన నేపాల్‌లో గత రెండు రోజులుగా హింసాత్మక నిరసనలు చెలరేగుతున్న నేపథ్యంలో భారత్-నేపాల్ సరిహద్దులో కేంద్ర ఏజెన్సీలు హై అలర్ట్ ప్రకటించాయి. నేపాల్‌లోని అశాంతిని ఆసరాగా చేసుకుని సంఘ విద్రోహ శక్తులు భారత భూభాగంలోకి ప్రవేశించి, సరిహద్దు రాష్ట్రాల్లో హింసను ప్రేరేపించే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి.**

. ఈ హెచ్చరికలతో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల పోలీసులతో పాటు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాలను అప్రమత్తం చేశారు.ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం, నేపాల్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితులను అదునుగా తీసుకుని కొందరు దుండగులు సరిహద్దు దాటి వచ్చి, ఇక్కడి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కల్పించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో సరిహద్దు వెంబడి భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలని, నిఘాను తీవ్రతరం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఉత్తరాఖండ్‌లోని చంపావత్ జిల్లా, నేపాల్‌లోని మహేంద్రనగర్‌తో సరిహద్దు పంచుకుంటుంది. అక్కడ నేపాల్ సైన్యం కర్ఫ్యూ విధించడంతో భారత భూభాగంలో భద్రతను పెంచారు. పితోర్‌గఢ్ జిల్లాలోని ధార్చులాలో కూడా నిఘా పెంచారు. ఇక్కడ నివసించే




చాలా మందికి నేపాల్‌లో బంధువులు ఉండటంతో వారిలో ఆందోళన నెలకొంది.బీహార్‌లోని మధుబని జిల్లాలోనూ ఎస్ఎస్‌బీ బలగాలను మోహరించారు. అక్కడి ఎస్పీ యోగేంద్ర కుమార్ మాట్లాడుతూ, "నేపాల్ పరిస్థితుల దృష్ట్యా మధుబని పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉన్నారు. సరిహద్దు దాటుతున్న వారి గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతిస్తున్నాం. సంఘ విద్రోహ శక్తులు ఎవరూ సరిహద్దు దాటకుండా చూస్తున్నాం" అని తెలిపారు.యూపీలో ఏడు సరిహద్దు జిల్లాలైన పిలిభిత్, లఖింపూర్ ఖేరి, బహ్రైచ్, శ్రావస్తి, బలరాంపూర్, సిద్ధార్థనగర్, మహారాజ్‌గంజ్‌లలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 73 చెక్‌పోస్టుల వద్ద నిరంతర గస్తీ, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీజీపీ రాజీవ్ కృష్ణ తెలిపారు. లఖింపూర్ ఖేరిలో బీఎస్ఎఫ్, ఇతర భద్రతా బలగాలతో కలిసి జాయింట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌పీ సంకల్ప్ శర్మ చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఉన్న పానీటంకీ సరిహద్దు వద్ద కూడా భద్రతా బలగాలు నిరంతర నిఘా కొనసాగిస్తున్నాయి.



## నేపాల్ సారథి సుశీల కర్కి

నేపాల్ లో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వానికి మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి నాయకత్వం వహిస్తారు. ఈ మేరకు జనరల్ జెడ్ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. దాదాపు ఐదు వేలమంది యువకులు వర్చువల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.జనరల్ జెడ్ ఆన్ లైన్ లో నిర్వహించిన సమావేశం ప్రధానంగా దేశ అత్యున్నత పదవికి అర్హులైన అభ్యర్థులపై ప్రధానంగా చర్చించింది. ఒకదశలో ఖాట్మండు మేయర్ బాలెన్ షా పట్ల అనుకూలత వ్యక్తమైనా, ఆయనను సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడంతోమెజారిటీ సభ్యులు సుశీల కర్కి పేరుకు మద్దతు తెలిపారని జనరల్ జెడ్ ప్రతినిధి వెల్లడించినట్లు నేపాల్ మీడియా పేర్కొంది. జనరల్ జెడ్ ప్రతినిధులు ముందుగా సుశీల కర్కి ని సంప్రదించగా, కనీసం వెయ్యిమంది తన పేరును సమర్థించిన పక్షంలోనేతాను ఈ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధపడతానని పేర్కొనగా, ఆమె పేరును ప్రతిపాదిస్తూ 2,500 మందికి పైగా యువకులు సంతకాలు చేశారు.సమావేశంలో సుశీల కర్కి పేరుతో పాటు, నేపాల్ విద్యుత్ అథారిటీ చీఫ్ కుల్మాన్ ఘిసింగ్, యువనాయకుడు సాగర్ ధకల్, ధరణ్ మేయర్ హర్కా సంపాంగ్ ల పేర్లు కూడా ప్రస్తావనకు వచ్చినా సుశీల కర్కి ప్రధానమంత్రి పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.కల్లోల నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక సారథిని ఎన్నుకునేందుకు అక్కడి యువత (జెన్‌జెడ్) ముమ్మర చర్చలు జరుపుతోంది. తాత్కాలిక సారథిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆమె కూడా సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. అవినీతికి వ్యతిరేకంగా



## వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోటు

వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఇటీవల రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు

మిగతా 2లో

### భారత్-అమెరికా వాణిజ్య

## చర్చలకు సిద్ధం.. ట్రంప్ ట్వీటుకు మోడీ ఓకె



%న్యూఢిల్లీ : భారత్-అమెరికా సహజ భాగస్వామ్యపక్షాలు. ఈ చిరకాల, నిజమైన బంధం ప్రాతిపదికననే ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ప్రధాని మోడీ ఎక్స్ సామాజిక మాధ్యమం ద్వారా వెలువరించిన స్పందన ఇరుదేశాల ఇప్పటి అనిశ్చితత నడుమ అత్యంత కీలకం అయ్యాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య అడ్డంకులు పరిష్కారించుకునేందుకు అన్ని విదాలుగా దౌత్యచర్చలు జరుగుతున్నాయని ట్రంప్ వెలువరించిన వ్యాఖ్యలకు స్పందనగా మోడీ ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించారు. ట్రంప్ ట్రూత్ సోషల్ వ్యాఖ్యలకు స్పందనగా మోడీ ఎక్స్ స్పందన వెలువడింది. రెండు దేశాలు మిత్రదేశాలుగా ఉన్నాయి.

ఇది సహజసిద్ధమైన, ఎటువంటి ఇతర ప్రభావాలకు తావులేని బంధం అయి ఉంది. ద్వైపాక్షిక ట్రేడ్ డీల్ గౌరవప్రదంగా, పరస్పర ప్రయోజనాల కోణంలో నిలిచి తీరేందుకు అన్ని ప్రయత్నాలు సాగుతున్నాయని మోడీ తెలిపారు.త్వరలోనే

మిగతా 2లో



## మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం.. పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి: సుప్రీం

న్యూఢిల్లీ: నేపాల్‌లో యువత నిరసనలు హింసాత్మకంగా మారాయి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్ లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్‌హసీనా.. దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ పరిణామాల నడుమ ఓ కేసు విచారణ సమయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్ లోని పరిస్థితులను ఉటంకిస్తూ మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్టు పేర్కొంది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశంపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వం లోని ఈ ధర్మాసనం లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఎఎస్ చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.ఈ క్రమం లోనే రాజ్యాంగాన్ని ప్రస్తావించిన సీజేఐ జస్టిస్ బిఆర్‌గవాయ్, ప్రజా ప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీం కోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి

మిగతా 2లో




## ఇండ్లు కూల్చడమేనా?

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే, తమ ఇండ్లను కూలగొట్టేందుకు ప్రభుత్వానికి లైసెన్స్ ఇ చ్చినట్టేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టడమేనా ప్రశ్నించారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి కాంగ్రెస్ నేతలు కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఉప ఎన్నికలలో కా రు గుర్తుకు ఓటేసి కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి అ హంకారాన్ని బొందపెట్టాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన జూబ్లీహిల్స్ ని యోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్ర సంగించారు. తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు ఆపేస్తామంటూ ప్రజలను కాంగ్రెస్ బెదిరిస్తోందని ఆరోపించారు. హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉప ఎన్నికలో పంచి గెలవడానికి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ప్రజలకు ఒక్కమంచి పని కూడా చేయని రేవంత్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తమ అసమర్థతను అప్పులపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు తీవ్రంగా ద్వేషిస్తున్నారన్నారు. గణేష్ నిమజ్జనానికి వెళ్లిన సీఎం రేవంత్ ను ప్రజలు ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రభుత్వంతో ప్రజలు డిస్‌కనెక్ట్ అయ్యారనడానికి అదే నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లో చేరలేదన్న అక్కసుతో బీఆర్ఎస్ కార్యకర్త

మిగతా 2లో



## డైవర్షన్ పాలిటిక్స్ మానండి:హరీశ్‌రావు

**హైదరాబాద్:** దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతగా తిప్పలు పడ్డ పరిస్థితులు ముందెన్నడూ లేదని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎంఎల్ఎ హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలన వల్ల పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం నడిరోడ్ల వెంట బారులు తీరుతున్నారని, ఆధార్ కార్డు, పాస్ బుక్కులు చేత పట్టుకొని యూరియా బస్తా కోసం పడిగాపులు కాస్తున్నరని, పండుగ లేదు..పబ్బం లేదు..వాన లేదు..ఎండ లేదు, రాత్రి లేదు, పగలు లేదు క్యూలో నిలబడుతున్నరని, అలసి సొలసి పడిపోతున్నరని, ఓపిక లేక క్యూలో చెప్పులు, పాస్‌బుక్కులు, అట్ట డబ్బాలు, ఖాళీ సీసాలు, రాళ్లు పెట్టి రోజుల పాటు నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'పత్తి పూత దశతో ఉందని, ఇప్పుడు యూరియా వేయకపోతే దిగుబడి రాదు' అని ఒక రైతు. 'వరి పొట్ట దశలో ఉందని, యూరియా చల్లకపోతే పంట వేసి వృథం' అని మరొక రైతు పడుతున్న ఆవేదన చూస్తే గుండె తరుక్కుపోతున్నదన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభానికి నిన్న సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో కట్టలు తెంచుకున్న రైతుల ఆగ్రహమే నిదర్శనమన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మీద అసహనంతో జుట్లు పట్టుకొని కొట్టుకోవాల్సి రావడమే కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎక్కడిక్కడ హైవేలెక్కి ధర్నాలు

మిగతా 2లో

## బోధన్‌లో ఉగ్రకలకలం



# భారత్-అమెరికా వాణిజ్య చర్చలకు సిద్ధం.. ట్రంప్ ట్వీటుకు మోడీ ఓకె

ఒప్పందం కుదుర్చుకునేందుకు రెండు వైపుల నుంచి ప్రతినిధి బృందాలు రంగంలోకి దిగాయని చెప్పారు. భారతీయ సరుకులపై ట్రంప్ నుంచి ఏకంగా 50 శాతం వరకూ సుంకాల విధింపు , తరచూ భారత్‌పై మోడీ ఘాటైన మాటల నడుమ ఇరుదేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన దశలోనే ఇప్పుడు మోడీ అంతకు ముందు ట్రంప్ నుంచి ట్రేడ్ డీల్‌పై సానుకూలత వ్యక్తం కావడం కీలక పరిణామం అయింది. వచ్చే కొద్ది వారాలలోనే తాను మోడీతో మాట్లాడే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు, ఇది ఒప్పందం ఖరారుకు దారితీస్తుందని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనడంపై మోడీ కూడా సంతోషం వ్యక్తం చేశారు. ఇరుదేశాలూ మిత్రదేశాలు.
ఈ బంధం ముందుకు సాగుతుందని మోడీ వెల్లడించారు. తాను కూడా ట్రంప్‌తో నేరుగా మాట్లాడాలనుకుంటున్నానని, ఇరుదేశాల ప్రజల మరింత ఉజ్వల , సంపన్న భవిత నెలకొనే అధ్యాయం కోసం ట్రంప్‌తో పాటు తానూ ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. మోడీ వ్యాఖ్యలను వెంటనే ట్రంప్ తమ ట్రూత్ సోషల్ మీడియాలో ఇద్దరి ఫోటోలతో పొందుపర్చారు. ఇరువురు నేతల పరస్పర ఆశాభావ ప్రకటనల దశలో ఇక వచ్చే కొద్దిరోజుల్లోనే ట్రంప్ సంబంధిత విశ్వసనీయ అధికారిక బృందం భారత్‌కు చేరుకుంటుంది. ఈ దశలోనే ట్రేడ్ డీల్‌కు రంగంల సిద్ధం అవుతుందని భావిస్తున్నారు. అయితే ఈ బృందం ప్రత్యేకించి భారతీయ నౌకాదళం కోసం అత్యంత అధునాతనమైన బహుళ స్థాయి తీర ప్రాంత గస్తీ యుద్ధ విమానం పి8ఐ కొనుగోలు ఒప్పందం ఖరారుకు అని అధికార వర్గాలు తెలిపాయి. ట్రేడ్ డీల్ ఖరారు కూడా ఈ బృందం ప్రత్యేక చర్చనీయాంశం అవుతుందని వెల్లడైంది. ఈ నెల ఆరంభం నుంచి మోడీ పట్ల, భారత్ పట్ల ట్రంప్ సానుకూల స్పందన ప్రకటనలు వెలువడుతున్నాయి.ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక బంధం అత్యంత కీలకమైనదని, దేని గురించి ఆందోళన వెందాల్సిన అవసరం లేదని ట్రంప్ ప్రకటిస్తూ వచ్చారు. ఇక ఒక్కరోజు క్రితమే ఫైనాన్షియల్ టైమ్స్ లో భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వచ్చిన వార్తను ట్రంప్ కానీ ఆయన అధికారిక యంత్రాంగం కానీ నిర్ధారించలేదు. రష్యా ముడిచమురు సేకరణకు ప్రతిగా భారత్‌పై వంద శాతం సుంకాలు విధించాల్సిందే అని ట్రంప్ యూరోపియన్ యూనియన్‌ను ఆదేశించినట్లు వెలువడ్డ వార్త నిజం కాదని స్పష్టం అయింది. ఇరువురు నేతలు ఇప్పుడు ట్రేడ్ డీల్ త్వరలోనే ఖాయం అనే పరస్పర ప్రకటనలకు దిగుతూ రావడంతో భారత్ అమెరికా బంధం నీలినీడలు తొలిగిపోతాయనే దౌత్యవర్గాలు స్పందిస్తున్నాయి.

# ఇండ్లు కూల్చడమేనా?

సర్దార్ ఇంటిని కూల్చివేస్తే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా తన ఇల్లు కూలగొడుతుందన్న భయంతో కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ ప్రాణాలు తీసుకుందని గుర్తుచేశారు. డబ్బున్న పెద్దల జోలికి హైడ్రా పోదన్న కేటీఆర్, దుర్గం చెరువులో అక్రమంగా ఇల్లు కట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటిని కూల్చే దమ్ముందా అని ప్రశ్నించారు.
ప్రధాని మోడీని పెద్దన్నలా భావించి ఆయన మార్గదర్శనంలో రేవంత్ రెడ్డి నడుస్తోన్న విషయాన్ని మైనార్టీలు ఇప్పటికైనా గుర్తించాలని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించే బీజేపీ, మోడీ, సీబీఐ లాంటి అంశాల్లో కాంగ్రెస్ భావజాలానికి వ్యతిరేకంగా రేవంత్ పనిచేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కు ఓటేస్తే నరేంద్ర మోడీకి, బీజేపీకి వేసినట్టే అన్నారు. గడిచిన పదేళ్లలో మైనార్టీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. చరిత్రలో తొలిసారి మైనార్టీ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఏర్పాటు చేసిందన్నారు. ఎమ్మెల్సీ ఇస్తామని మోసం చేయడంతో పాటు షాదీ ముబారక్, మైనార్టీ గురుకుల పాఠశాలలు వంటి సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసిందని చెప్పారు. ఇప్పటివరకు ఒక్క మైనార్టీ విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్ అందించలేదన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పెన్షన్లు పెంచలేదని, రైతుబంధు ఎగ్గొట్టారని, ఆడబిడ్డలకు నెలనెలా రూ.2500 ఇవ్వడం లేదన్నారు.
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అడ్డగోలు అబద్దపు హామీల ప్రభావానికి గురై మోసపోయిన ప్రజలు ఇవాళ కాంగ్రెస్ ను తీవ్రంగా ద్వేషిస్తున్నారని అన్నారు. తమ ఆసమర్థతకు రాష్ట్ర ప్రభుత్వం అప్పులను కారణంగా చూపించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మాగంటి గోపినాథ్ హఠాత్తుగా దూరమవుతారని ఊహించలేదని చెప్పారు.ఎవరూ కోరుకోని ఉప ఎన్నిక ఇదన్నారు. తన ఇబ్బందులను గోపినాథ్ ఎన్నడూ తమతో పంచుకోలేదన్నారు. రాజకీయ నాయకుల జీవితాలు బయటికి కనిపించేలా ఉండవన్న సంగతి గోపినాథ్ కుటుంబాన్ని చూస్తే అర్థం అవుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో ఏ ఒక్కరికి కష్టమొచ్చినా ఆదుకుని, ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేసిన గోపినాథ్ కుటుంబానికి జూబ్లీహిల్స్ ప్రజలు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని పీజేఆర్ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారన్న కేటీఆర్, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ పరిస్థితి మెరుగ్గా ఉందని పలు సర్వేలు చెబుతున్నాయన్నారు.
కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేసి బంపర్ మెజార్టీకి కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలోని అన్ని సీట్లను గెలిపించి ప్రజలు బీఆర్ఎస్ కు అండగా నిలిచారన్న కేటీఆర్, అదే స్ఫూర్తితో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించుకుని, హైదరాబాద్ గులాబీ అడ్డా అన్న సందేశాన్ని దేశానికి ఇవ్వాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.ఈ నెల 14వ తేదీలోపు ప్రతి ఇంటికి వెళ్లి, గోపినాథ్ చేసిన పనులు, సేవలను ఓటర్లకు గుర్తుచేయాలన్నారు. బీఆర్ఎస్ అభిమానులు, సానుభూతిపరుల ఓట్లు గల్లంతైతే వెంటనే నమోదు చేయించాలని సూచించారు. యుద్ధంలా పోరాడితేనే విజయం సాధ్యమవుతుందని కార్యకర్తలకు దిశానిర్దేశనం చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రహ్మత్ నగర్ ఇంచార్జీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పి. విష్ణువర్ధన్ రెడ్డి, కోరుకంటి చందర్, దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత తో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ మానండి:హరీశ్‌రావు

చేస్తున్న రైతన్నల ఆగ్రహ జ్వాలలే నిదర్శనమన్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన సంక్షోభం, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల రైతన్నకు వచ్చిన సంక్షోభమన్నారు. యూరియా అడిగిన పాపానికి రైతుల చెంపలు చెల్లుమనిపించిన సోకాల్ ప్రజా పాలన ఇదని, 22 నెలల పాలనలో యావత్ తెలంగాణ రైతాంగాన్ని నడి రోడ్డు మీదకు ఈడ్చిన దుర్మార్గ పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది, రేవంత్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పాలనలో సకాలంలో సరఫరా అయిన యూరియాను ఇప్పుడు ఎందుకు చేయలేకపోతున్నారు? పాలకులు మారగానే పాలసీలు మారిపోతాయా? రైతుల కష్టాలు తీర్చని ప్రభుత్వం ఏండి ఏం లాభం?కేంద్రం నుంచి యూరియా తెప్పించడంలో, సరఫరాలో ఈ ప్రభుత్వానికి ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకపోవడం శోచనీయమన్నారు రాష్ట్రంలో రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తుండం దారుణమని మండిపడ్డారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరం వైఫల్యం చెందిందన్నారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసారని వెల్లడించారు.రుణమా ఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరుతో పచ్చి మోసం చేసారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కన్నీళ్లు పెట్టిస్తున్నరని, అరిగోస పెడుతున్న రని ఆవేదన వ్యక్తం చేశారు. జై కిసాన్ అని నాటి కాంగ్రెస్ అంటే, నై కిసాన్ అని నేటి నేటి రేవంతు అంటున్నాడన్నారు. బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు ఉండి ఏం లాభం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం తప్ప చేస్తున్నదేం లేదు. బిజెపి, కాంగ్రెస్ నిర్లక్ష్యం వైఖరి రైతాంగా నికి మరణ శాసనంగా మారిందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 10శాతం తగ్గించడంతో ఆయిల్ ఫాం రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.
తాజాగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడంతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టె బాధ పడుతున్నారని వెల్లడించారు. ఇక యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వైఖరి వల్ల రైతులు కంటి నిండా నిద్ర పోని పరిస్థితి నెలకొందన్నారు. ఇన్ని సమస్యలు రైతులను చుట్టుముడుతున్నా ఇక్కడి బిజెపి, కాంగ్రెస్ ఎంపిలకు ఉలుకు లేదు, పలుకు లేదన్నారు. 8 మంది బిజెపి ఎంపిలు, 8 మంది కాంగ్రెస్ ఎంపిలు ఉండి తెలంగాణకు చేస్తున్నది ఏమున్నదని, ఏమీ లేదని, శుష్క ప్రియాలు శూన్య హస్తాలు. పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపును ఉపసంహరించుకోవాలని, పత్తిపై ఎత్తివేసిన దిగుమతి సుంకాన్ని యదావిధిగా కొనసాగిం చాలని ఈ మేరకు ఎంపిలు కేంద్రం పై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి పనికి మాలిన డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని, రైతాంగానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంపై దృష్టి పెట్టాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. లేదంటే యూరియా కోసం రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు

బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయన శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్థి నష్టం తగ్గిందని అన్నారు.
సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని, ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలకు కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని ఈ సమావేశంలో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్అండ్‌బి, విద్యుత్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.నిజమైన జర్నలిస్టులకు మేలు జరగాలి : నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఐఅండ్‌పిఆర్ స్పెషల్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక, సిపిఆర్‌ఓ మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హై పవర్ కమిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థిక శాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

# ట్రంప్ డబుల్ గేమ్.. దాడి మొదలైన తర్వాత అమెరికా నుంచి ఫోన్

%వాషింగ్టన్: హమాస్ నేతలే లక్ష్యంగా ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడికి సంబంధించి అమెరికాకు సమాచారం ఉన్నప్పటికీ ఖతార్‌కు దాన్ని చెప్పడంలో ఆలస్యం చేసింది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డబుల్ గేమ్ ఆడుతున్నారనే భావన మొదలైంది. ఇజ్రాయెల్ చేసిన దాడిలో హమాస్ కీలక నేత ఖలీల్‌అల్‌హయ్యా కుమారుడితో సహా ఆరుగురు మృతి చెందారు. దీని గురించి అమెరికాకు ముందే సమాచారం ఇచ్చామని టెల్ అవీవ్ చెప్పింది. యూఎస్ కూడా దాన్ని అంగీకరించింది. దాడి గురించి ఖతార్‌కు సమాచారం ఇచ్చామని అగ్రరాజ్యం పేర్కొంది. అయితే దాడులు మొదలైన 10 నిమిషాల తర్వాత యూఎస్ నుంచి తమకు కాల్ వచ్చిందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికారి పేర్కొన్నారు. పేలుళ్లు జరుగుతుండగా, అమెరికా అధికారి ఒకరు ఫోన్ చేశారన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి చివరి హెచ్చరికగా యూఎస్ ప్రతిపాదన మేరకే దోహాలో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమం లోనే ఇజ్రాయెల్ దాడి చేయడం గమనార్హం. కాగా, ఈ సమాచారం ఉన్నప్పుడు ముందుగానే ఎందుకు తెలియజేయలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.%ఇటీవల మిత్రదేశాలతో కూడా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. మిత్రదేశ మంటూనే భారత్‌పై భారీ సుంకాల మోత మోగించారు. తాజా దాడులతో ఖతార్‌కు కూడా ట్రంప్ నుంచి అలాంటి చేదు అనుభవం ఎదురైనట్టు ఉంది. అమెరికాఖతార్ మధ్య బంధం ఇటీవల బలపడింది. ఆ దేశ పాలకుల నుంచి విలాసవంతమైన విమానాన్ని అధ్యక్షుడు బహుమతిగా అందుకున్నారు. ఇక ఆ దేశ పర్యటనలో కీలక ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. పశ్చిమాసియాలో తన దౌత్య ప్రయత్నాలకు ఈ గల్ఫ్ దేశం కీలకపాత్ర పోషిస్తోంది.హమాస్ ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది.



దీంతో అమెరికా మిత్రదేశంపై ఇజ్రాయెల్ దాడి చేయడమనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ దాడులకు సంబంధించి అమెరికా స్పందించిన తీరు గందరగోళానికి దారి తీస్తుంది. వైట్‌హౌస్ ప్రతినిధి కరోలిన్‌లీవిట్ విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడి గురించి తెలియజేయాలని పశ్చిమాసియా రాయబారి విట్కాఫ్‌ను ట్రంప్ ఆదేశించారని పేర్కొన్నారు. ఈ సంఘటన తరువాత ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ దాడి గురించి ముందే చెప్పామంటూ హడావుడిగా వివరణ ఇచ్చారు. అనంతరం దాడికి సంబంధించిన నిర్ణయం తాను తీసుకోలేదంటూ పోస్టు పెట్టారు. మరోసారి ఇలాంటి దాడులు జరగవని ఆయన హామీ ఇచ్చారు. ఈ దాడి పూర్తిగా తమ చర్యేనని, ఇందులో యూఎస్ ప్రమేయం లేదంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఖతార్‌కు ట్రంప్ ద్రోహం చేశారంటూ నెట్టింట పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

## నేపాల్ సారథి సుశీల కర్కి

నేపాల్‌లో కొనసాగుతున్న ఉద్యమం హింసాత్మక సంఘటనలకు దారి తీయడంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో కొత్త సారథిని ఎన్నుకునేందుకు జనరేషన్ జెడ్ ఉద్యమకారులు ప్రయత్నాలు చేస్తున్నారు.దాదాపు 5 వేల మంది బుధవారం వర్చువల్‌గా సమావేశమై మంతనాలు జరిపారు. ఖాట్మండ్‌మేయర్ బాలెన్ షాను తొలుత పరిగణన లోకి తీసుకున్నప్పటికీ, ఆయన నుంచి స్పందన రాలేదని తెలిసింది. దీంతో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి వైపు జెన్‌జెడ్ ప్రతినిధులు మొగ్గు చూపినట్టు నేపాల్ మీడియా వెల్లడించింది. బాధ్యతలు స్వీకరించేందుకు కర్కి సిద్ధమైతే తొలుత ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌తో భేటీ కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆమోదం పొందాల్సి ఉంటుందని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**ఎవరీ కర్కి?**

సుశీలా కర్కి (72) కి నేపాల్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగు పెట్టారు. నిర్భయంగా సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మరకలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009 లో సుప్రీం కోర్టులో అడుగుపెట్టి , శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టి , నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు.నేపాల్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు ముగ్గురు పోలీసులు సహా 25 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు వెల్లడించారు. మరో 633 మంది గాయాలపాలైనట్టు తెలిపారు. ఆందోళనల్లో గాయపడిన నేపాలీ కాంగ్రెస్ చీఫ్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్ బాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటున్నట్టు తెలిసింది. నేపాల్‌లో ఆందోళనలు అదుపు లోకి రాకపోవడంతో సైన్యం నిరవధిక కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే.ద

## పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి: సుప్రీం

ఉందన్నారు. "మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. "అవును%ూ% బంగ్లాదేశ్ లోనూ " అంటూ జస్టిస్ విక్రమ్ నాథ్ స్పందించారు. బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం 20 బిల్లులు మాత్రమే రిజర్వులో ఉన్నట్టు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## బోధన్‌లో ఉగ్రకలకలం

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా బోధన్ ఒక్కసారిగా ఉలికిపడింది. 'ఉగ్ర' లింకులు కలకలం సృష్టించాయి. ఎన్ఐఎ, కేంద్ర దర్యాప్తు సంస్థలు నిజామాబాద్ జిల్లా బోధన్‌లో తనిఖీలు చేపట్టాయి. 'బోధన్ పట్టణంలో బుధవారం తెల్లవారు జామున ఎన్ఐఎ విస్తృతంగా తనిఖీలు ని ర్వహించాయి. కాగాఐఎస్ఐఎస్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అ నుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. అనంతరం బోధన్ కోర్టు లో ప్రవేశపెట్టి కస్టడీకి తీసుకున్నట్లు సమాచారం. కాగా ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా కేంద్ర నిఘా సంస్థలు, ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు కలిగి ఉన్న వారిపై నిఘా ఉంచాయి. ఈ క్రమంలో అషర్ డానిష్‌ను జారండ్‌లోని రాంచీలో అరెస్ట్ చేశాయి.అనంతరం అతడు ఇచ్చిన సమాచారం మేరకు దేశ వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాయి. ఢిల్లీలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకు న్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని బోధన్ పట్టణంలో కూడా ఎన్ఐఎ బృందాలు జల్లెడ పట్టాయి. పక్కా సమాచారం మేరకు ఉగ్ర మూలాలు కలిగిన వ్యక్తిని అరెస్టు చేశాయి. అతని వద్ద ఐఎస్ఐఎస్ కార్యకలాపాలకు సంబంధించిన కీలక సమాచారం రాబట్టడంతో పాటు ఓ ఎయిర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయమై స్థానిక పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థలు సైతం అధికారికంగా విషయాలు వెల్లడించలేదు. గతంలోనూ బోధన్ పట్టణంలో ఉగ్రలింకులకు సంబంధించి ఎన్ఐఎ సహా పలు కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు చేపట్టాయి. ఉగ్ర లింకులు కలిగిన వారిపై ఆరా తీశాయి. ప్రత్యేకించి బంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు ఇక్కడి నుంచే పాస్‌పోర్టులు జారీ అయిన ఉదంతం కూడా అప్పట్లో తీవ్ర చర్చకు దారి తీసింది. తాజాగా ఐఎస్ఐఎస్‌తో సంబంధాలున్న వ్యక్తి పట్టుబడడం జిల్లాలో చర్చనీయాంశంతో పాటు ఆందోళనలకు తావునిస్తోంది.

## నేపాల్‌లో భారత టూరిస్ట్ ఆవేదన..

%ఖాట్మండ్ : నేపాల్‌లో జెన్‌జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు ఆందోళనకారులు నిప్పంటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హెటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది."నా పేరు ఉపాసన గిల్. వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చాను. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హెటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హెటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారు" అని గిల్ వాపోయారు. వారి నుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు."వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతీదీ తగులబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు చాలా మంది సహాయం కోసం ఎదురు చూస్తున్నారు" అని పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్‌లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణన లోకి తీసుకోవాలని కోరింది.నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తరప్రదేశ్ లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్థంతరంగా ముగించుకొన్నారు. ఇదిలా ఉంటే చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసన కారులను కోరారు. ప్రస్తుతం ఆర్మీ అక్కడ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది. సాయంత్రం ఐదు గంటల వరకు దేశ వ్యాప్తంగా కర్ఫ్యూ కొనసాగనుంది.

## 15 ఉద్యోగ సంఘాలకు మళ్లీ గుర్తింపు

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చొరవతో సుదీర్ఘకాలం తర్వాత తెలంగాణ రాష్ట్ర ఉద్యోగసంఘాలు తిరిగి ప్రభుత్వ గుర్తింపునకు నోచుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఉద్యోగసంఘాలకు గుర్తింపు ఇవ్వాలన్న ఉద్యోగ సంఘాల విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు(జివో నెం.185) జారీచేసింది. మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో సమావేశమయ్యారు. వెంటనే సాధారణ పరిపాలన శాఖ(జిఎడి) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా కు చీఫ్ సెక్రెటరీ వారితో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించారు. బుధవారం మధ్యాహ్నం పర్మనెంట్ మెంబర్స్‌గా తొమ్మిది ఉద్యోగ సంఘాలు, రొటేషన్ ప్రాతిపదికన ఆరు ఉద్యోగ సంఘాలుల మొత్తం 15 ఉద్యోగ సంఘాలను ప్రభుత్వం గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పర్మనెంట్ మెంబర్స్‌గా తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్(టిఎన్జీవో సెంట్రల్ యూనియన్),తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సెంట్రల్ అసోసియేషన్), డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్(టిజిఎస్ఎ), ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టిచర్స్ యూనియన్(పిఆర్‌టియు టిఎస్), స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్టీయూ టిఎస్), తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్(ట్రెసా), తెలంగాణ క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(టిఎస్ యూటిఎఫ్), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) ఉన్నాయి. రొటేషన్ ప్రాతిపదికన ఆరు ఉద్యోగ సంఘాలను ప్రభుత్వం గుర్తించింది. వాటిలో తెలంగాణ సెక్రెటేరియేట్ ఆఫీసర్స్ అసోసియేషన్(టిజిఎస్ఓఎ), డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టిజిటిఎ), తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టిపియుఎస్), స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్), గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఉన్నాయి. ఉద్యోగసంఘాల గుర్తింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలతో దశాబ్దాలుగా గుర్తింపును పొందిన ఉద్యోగ సంఘాలను 2014 వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఉద్యోగసంఘాల గుర్తింపును రద్దు చేశారు. ప్రజల ఆదరణతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం తిరిగి ఉద్యోగ సంఘాలకు గుర్తింపును ఇవ్వడం పట్ల ఉద్యోగ సంఘాల జేఏసీ పక్షాన మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టు విక్రమార్క, మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.నిజమైన జర్నలిస్టులకు మేలు జరగాలి : నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఐఅండ్‌పిఆర్ స్పెషల్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక, సిపిఆర్‌ఓ మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు.

సత్యమేవ జయతే



### విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి....



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..వికారాబాద్ జిల్లా కోట్ పల్లి బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్వాడి, చౌక ధర దుకాణాలను కమిషన్ సభ్యులు భారతి, శారద , ఆనంద్ లతో కలిసి రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ ను రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌక ధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని ఆయన తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన వివరాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు సిబ్బందిని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన ప్రజలు మండల కేంద్రంలో 24 గంటలపాటు వైద్య సేవలు ఉండాలని అదేవిధంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కమిషన్ చైర్మన్ పర్యటనలో డిఆర్డిఏ శ్రీనివాస్, డిఇఓ రేణుకా దేవి, డీఎంహెచ్ఓ లలితా దేవి, డిడబ్ల్యూఓ కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి....














సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..గతంలో పరిగి పట్టణంలోని జిల్లా పరిషత్ నం.1 పాఠశాలలో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తానని మాట ఇచ్చిన పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు, ఆ హామీని నిలబెట్టుకుంటూ రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.లి

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన కొన్ని మౌలిక సదుపాయాల విషయాన్ని పరిగి ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న పురాతన భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే గారు,వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజలు పోరాటాలు చేయాలి



సత్య మేవ జయతే. నారాయణ ఖేడ్తెలంగాణ సాయుధ రైతంగా పోరాటానికి ఊపిరి పోసిన చాకలి ఐలమ్మ పోరాటం ఆదర్శం తెలంగాణ సాయుధ రైతంగ పోరాటం వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించడం జరిగింది సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో తన భూమిని దొరల నుండి కాపాడుకోవడం కోసం తాను పండించిన పంటను కాపాడుకోవడం కోసం చేసిన పోరాటంలో ముందు భాగం నిలిచారని ధైర్యంగా దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసి తన పంటను కాపాడుకుంటే దొరలు బలవంతంగా తన ఇంటిపై గుండాలతో దాడి చేసి ధన్యని తీసుకుపోతే ప్రతిగాటించిన సందర్భంగా దొరలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన తీస్తే దొరల గుండాలు జర్పిన కాల్పులలొ దొడ్డి కొమరయ్య చనిపోయారని నాడు చేసిన తిరుగుబాటు చేసిన చాకలి ఐలమ్మ చివరి వరకు ఎర్ర జెండా కోసం నిలబడ్డారని వీరనరి ఐలమ్మ జీవితం ఎంతో ఆదర్శం అని కొనియాడా కావున ప్రజలు ప్రజా సమస్యలపై చాకలి ఐలమ్మ స్ఫూటీతో పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకత్వం సంతోష్ కాన్సిరాం రఘు సంతోష్ గణపతి ఉన్నారు

# రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొంది..













### = జోరుగా ఎన్నికల ప్రచారంలో తనమునకలైన అభ్యర్థులు

### = ఢీ అంటే ఢీ అంటున్న ప్రత్యర్థులు

### = గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం

కుత్బుల్లాపూర్,అక్టోబర్ 10, సత్యమేవ జయతే ప్రతినిధి:- జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా మంగళవారం నామినేషన్ల ఉపసంవరణ గడువు ముగియడంతో చతుర్ముఖ పోటీ నెలకొంది. అందులో భాగంగా నాలుగు క్యాడర్ల అభ్యర్థులు పోటీలో నిలుచారు. 1). తల్లోజు శ్రీనివాస్ ఆచారి:- అధ్యక్ష అభ్యర్థి (ధనస్సు గుర్తు), లక్ష్మణ్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(టీవీ గుర్తు), (2). గార్లపాటి ప్రభాకర్:- అధ్యక్ష అభ్యర్థి (బొంగరం గుర్తు), గుదే.వెంకటేష్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(టేబుల్ ఫ్యాన్ గుర్తు), (3). ధర్మారపు అంజయ్య:- అధ్యక్ష అభ్యర్థి(బుల్లెట్ బండి గుర్తు), ముచ్చెంతల భూపతిరెడ్డి:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(లేడి గుర్తు), (4). యువరాజ్:- అధ్యక్ష అభ్యర్థి (ఉంగరం గుర్తు), అరుణ్ కుమార్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(క్యారం బోర్డ్ గుర్తు).

ఈ సందర్భంగా ప్రత్యర్థులు జోరుగా ఎన్నికల ప్రచారంలో తనమునకలైనారు. ఢీ... అంటే ఢీ... అంటూ ఒకరికొకరు పోటీపడి ప్రచారం చేస్తున్నారు. ఎవరికివారు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కొందరు తాము కాలనీకి చేసిన మంచిపనులే తమను గెలిపిస్తాయనే ధీమాతో ఉంటే, మరికొందరు ప్రజలు మార్పు కోరుకుంటున్నారు కాబట్టి మేమే గెలుస్తామనే భరోసాతో ఉన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తీర్చే దిశగా ఎవరికి వారు హామీలను గుప్పిస్తూ, వాగ్దానాలు చేస్తూ ఓటర్ మహాశయులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. హామీల్లో భాగంగా స్థానికంగా నెలకొన్న త్రాగునీరు, కరెంటు, వీధి దీపాలు, డ్రైనేజీ, ఆర్టీసీ బస్సు సౌకర్యం, కమ్యూనిటీ హాల్, మహిళా భవన్ లాంటి ప్రధాన సమస్యలను తీరుస్తామని హామీలు ఇస్తూ వాగ్దానాలు చేస్తున్నారు. కానీ స్థానిక ప్రజలు మాత్రం గత నలభై రోజులుగా త్రాగునీటి కోసం తంటాలు పడుతూ నాయకులపై తీవ్రమైన ద్వేషంతో రగిలిపోతున్నారు. సంక్షేమ సంఘం ఎన్నికలు అంటేనే విముకత చూపుతున్నారు. దానికి ప్రధాన కారణం కాలనీలో ఏళ్ల తరబడి (నెలకొన్న) ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు నేటికీ స్థానిక సంక్షేమ సంఘం నాయకులు గానీ , ప్రజా ప్రతినిధులు గానీ శాశ్వత పరిష్కారం చూపకపోవడమే. “రాజులు మారినా రాజ్యాలు మారలేదు” అనే (సామెత) నానుడి అక్షరాల ఈ రాజీవ్ గృహకల్ప కాలనీకి వర్తిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ క్లిష్టమైన పరిస్థితుల్లో ఈనెల 14వ తేదీన జరగబోయే స్థానిక సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి మరి.

# మర్పల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం..

### మర్పల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం..

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రాజీ నామా చేసి రాజకీయం చేయాలి...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..

వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం రాష్ట్ర స్థాయి జనతా గ్యారేజ్‌గా మారినట్లే, మర్పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం కూడా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే జనతా గ్యారేజ్‌లా పనిచేస్తుంది” అని అన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు యూరియా కోసం కష్టపడుతుంటే వారిని పరామర్శించే నాయకులపై కేసులు పెడుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. “ఇలాంటి కేసులకు భయపడేది లేదు” అని ఆయన స్పష్టం చేశారు. అలాగే, ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి సీతక్క కూర్చున్నారని గుర్తుచేసిన ఆయన, “అప్పుడు ఉన్న బంగారు బాత్రూంలే వాడుతున్నారా?” అని ప్రశ్నించారు..స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై కూడా డాక్టర్ ఆనంద్ విమర్శలు గుప్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉపాధ్యాయులను మరచి రాజకీయాలు మాట్లాడడం సమంజసం కాదని, నిజంగా రాజకీయాలే చేయాలనుకుంటే రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యాలయం కేవలం పార్టీ కార్యక్రమాలకే కాకుండా ప్రజల అవసరాల కోసం కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చేయాల్సిన పనులు, ఆన్లైన్ సేవలను ఉచితంగా అందించే కేంద్రంగా పార్టీ కార్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రతిరోజు ఒక నాయకుడు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు.తరువాత డాక్టర్ మెతుకు ఆనంద్, మర్పల్లి మండల నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మాజీ సీఎం కేసీఆర్ పాటలకు నృత్యాలు చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు..

# రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడి తప్పింది



సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడి తప్పిందని, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ముఖ్యమంత్రి ,మంత్రులు, కక్ష్య సాధింపు రాజకీయాలతో, అబద్ధాలతో, కాలం వెళ్లదీస్తున్నారని, పైగా త మ అసమర్థతను ప్రతిపక్షపార్టీలపై నెడుతున్నాడని, %దీ=ా% పార్టీ నాయకుల పై %జదీ×% కేసులు ఈ పెట్టి బయటపెడుతున్నారని, సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతున్న బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బి ఆర్ టి యు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టైగర్. కృష్ణయ్య విమర్శించారులి ఒకపక్క రాష్ట్రంలో రైతులకు ఎరువులు సకాలంలో అందక, రాష్ట్రవ్యాప్తంగా రోజుల తరబడి ఆందోళన చేస్తున్న, అర్ధరాత్రి నుండి కిలోమీటర్ల మేర, లైన్లు కడుతున్న, రైతులకు యూరియ అందించడం లేదనీ, యూరియాను రైతులకు అందించడంలో ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ,ఘోరంగా విఫలం చెందిందని, విమర్శించారురైతు సమస్యలు పరిష్కరించడంలో, రైతులకు రెండు లక్షలు ఒకేసారి, అందరికీ, రుణమాఫీ చేయడంలో, రైతుబంధు, రైతు బీమా పథకం, యూరియా, ఎరువులు, విత్తనాలు, సకాలంలో ఇవ్వ నందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. బి . ఆర్ ఎస్ పార్టీ,కెసిఆర్ పాలనలో ఎప్పుడూ ఇలా జరగలేదని తెలియ జేశారు. కాంగ్రెస్ పార్టీ , ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయడం లేదని, అమలు చేయకపోగా, ప్రజలను పక్కదారి పట్టించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి , మంత్రులు, ఆరితేరినారని కృష్ణయ్య ఎద్దేవ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వన్నీ అడిగితే, రాష్ట్రం అప్పులపాలు అయ్యిందని, తప్పుడు మాటలు మాట్లాడు తున్నారనీ విమర్శించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని,కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగులో ఉన్నాయని, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న , పెన్షన్లు పెంచడం లేదని, చదువుకున్న అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వడం లేదని, కళ్యాణ లక్ష్మి తులం బంగారం నేటికీ ఇవ్వడంలేదని, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం లేదని, నిరుద్యోగభృతి గూడ నేటికి ఇవ్వడం లేదని, కార్మికులకు కనీసా వేతనాలు అమలు చేయాడం లేదని కృష్ణయ్య విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి భూములు లాక్కుంటున్నారని, భూములు ఇవ్వము అన్న రైతులపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం రైతులను నట్టేట ముంచుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి తన రాజకీయ స్వార్థం కోసం ఐడ్రా అనే ఒక సంస్థను పెట్టి , మూసీ ప్రక్షాళన పేరుతో పేదల భూములు లాక్కోవడం కోసం, పేదల ఇండ్లను దారుణంగా కూల్చి వేశారని, వేలాది పేదల కుటుంబాలను బజారు పాలు చేశారని విమర్శించారు.

ఇందిరమ్మ ఇల్లు గ్రామాల్లో, పట్టణాల్లో, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారని, నిజమైన ఇండ్లు లేని పేదలకు, కొత్తగా పెళ్లయిన యువతకు, ఇవ్వలేదని విమర్శించారులి ఆసియా ఖండంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అయినా, లక్షల ఎకరాలు సాగుఅవుతున్న సగం తెలంగాణ రాష్ట్రం సాగునీటితో సస్యశ్యామలమయ్యే ప్రాజెక్టు , బిఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు, ఈ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని, కరువులేని రాష్ట్రంగా ఉండాలని, 80,000 /- కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, ప్రాధాన్యతగా నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టును, మేడిగడ్డలో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే అంత పెద్ద ప్రాజెక్ట ని, అవినీతి ప్రాజెక్టుగా బదనాం చేయడం, కేసీఆర్ గారికి వస్తున్న పేర్లు జీర్ణించుకోలేకపోవడం, రాష్ట్ర ప్రజలకు కాలేశ్వరం ప్రాజెక్టు గురించి నిజా నిజాలు తెలుస్తాయని. ఈ విషయంలో ముఖ్యమంత్రి , మంత్రులను వారు చేస్తున్న అబద్ధ ప్రచారాలను, తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని, విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అందులో తెలంగాణ ప్రజల దమ్మేంటో తెలియజేస్తారని కృష్ణయ్య అన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రిపై , మంత్రులపై, తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిందని అసమర్థ, మరియు చిల్లర ముఖ్యమంత్రిగా, రేవంత్ రెడ్డి మంత్రులు పేరు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మంత్రులకు వ్యక్తిగత సంపాదన మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర పాలన మీద లేదని విమర్శించారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన, ఆరు గ్యారంటీలు, 420 హామీలు, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున, కాంగ్రెస్ పార్టీకి ,ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా, ఆందోళన ,పోరాటాలు ,చేపడుతామని కృష్ణయ్య హెచ్చరించారు.

సత్యమేవ జయతే



### పేట మాదారంలో బిఆర్ఎస్ ఖాళీ

### కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు....













సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..పరిగి మండలం పేట మాదారం గ్రామానికి చెందిన బి . ఆర్ ఎస్ నాయకులు కొప్పుల వినాయక్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారి సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.

ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ పరిగి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు.

కొప్పుల వినాయక్ రెడ్డి యాలాల రాజేందర్ రెడ్డి సాలె కృష్ణయ్య,గొల్ల బిచ్చన్న, బస్వలింగం చల్వాడి సంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి మంచనపల్లి మల్లయ్య, కొత్తకుర్వ మల్లయ్య, యాలాల కృష్ణారెడ్డి, చింతలపల్లి రాములు పాలెపల్లి బిచ్చయ్య, చింతల తిరుమలయ్య, జి వేణుగోపాల్, నర్సోజి కె, కెటి రమేష్ గణేష్ సాలే, గొల్ల మల్లేష్, వహీద్, ఎండీ జావీద్ సాలె వెంకటయ్య నర్సింలు కుమ్మరి, మొల్ల మైబు సాలె రఘు చిట్యాల బాలయ్య, వై శ్రీనివాస్ రెడ్డి సి శ్రీకాంత్ యాలాల పెద్ద కృష్ణారెడ్డి యాలాల అంజి రెడ్డి, మంచనపల్లి మహేష్ గంట్ల యాదయ్య, గొల్ల శ్రీను కుమ్మరి ఆంజనేయులు, కుమ్మరి రాములు గొల్ల మల్లేశం గొల్ల గోపాల్ మొల్ల సమీర్ తో పాటు 60 మంది బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు,పరిగి ఎమ్మెల్యే %డ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

## రంగాపూర్ వద్ద 1 ఎకరా స్థలంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి...





సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..పరిగి మండలం రంగాపూర్ వద్ద పరిగి నియోజకవర్గ ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి 1 ఎకరా భూమి కేటాయించడం జరిగింది.ఈరోజు నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు,ముదిరాజ్ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి పరిగి శాసనసభ్యులు %డ% డీసీసీ అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సోదరులు పరిగి ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి,కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ముదిరాజ్ సంఘ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటును అందిస్తానని అన్నారు.అలాగే ముదిరాజ్ సోదరులను బిసి–డి నుండి బీసీ–ఏ లోకి చేర్చాలని 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు.తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముదిరాజ్ సోదరులను బిసి–డి నుండి బీసీ–ఏ లోకి రావడానికి కృషి చేస్తానని తెలిపారు.అదే విధంగా ముదిరాజ్ సోదరులను రాజకీయంగా కాంగ్రెస్ పార్టీలో అవకాశం కల్పించామని భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని అన్నారు.

బీసీ లకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయుటకు కాంగ్రెస్ పార్టీ నిబద్ధతగా ఉందని రాబోయే రోజుల్లో కచ్చితంగా బీసీ రిజర్వేషన్లను సాధించి తీరుతామని తెలిపారు.

సమాజంలో ముదిరాజులు అన్ని రంగాల్లో పనిచేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నారని అభినందించారు. ముదిరాజ్ సమాజ అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### లోక్ అదాలత్తో రాజీ చేసుకోండి చనగముల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ భరత్ కుమార్ రెడ్డి..




సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.. పూడూరు మండలం :ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పూడూరు మండలం చెంగోముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై భారత్ కుమార్ రెడ్డి,తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు కోర్టుల చుట్టూ తిరిగే బదులు, ఇరువర్గాలు రాజీకి వస్తే ప్రయోజనం ఉంటుందని ఆయనఅన్నారు. న్యాయ వ్యవస్థ ఆధ్వర్యంలో కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

# తెలంగాణ ధీర వనిత చాకలి ఐలమ్మ..

# ఆమె స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల పోరాటం

### - జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్

### - బీసీ సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మకు ఘన నివాళులు.



. సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..తాండూరు, : జమీందారుల అనుచరులకు ఎదురోడ్డి రైతాంగ మహిళలకు ధైర్యాన్ని నూరిపోసిన దీరవనిత చాకలి ఐలమ్మ అని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ అన్నారు.

బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తాండూరు పట్టణం వీవీహెచ్ఎస్ స్కూల్ సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే బీసీలకు రాజకీయ ఆర్థిక సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. జమీందారుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా తిరగబడి తెలంగాణ రైతాంగ పోరాటానికి మార్గదర్శకురాలిగా నిలిచారని అన్నారు. ఆమె ధైర్యసాహసాలు అనేకమందికి ప్రేరణగా మారి సమానత్వం సామాజిక న్యాయం కోసం ఉద్యమానికి దిశ చుపాయని కొనియాడారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని నేడు బీసీ సమాజం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్లను అమలుకై పోరాడవలసిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా చాకలి ఐలమ్మ వర్ధంతిని అధికారికంగా ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేష్, బీసీ సోషల్ మీడియా ఇంచార్జ్ బసవరాజ్, బిసి సంఘం యువ నాయకులు రాము ముదిరాజ్, మంతటి రాజు, చాకలి బిచప్ప, ప్రభాకర్ గౌడ్, నాయి అనిల్ కుమార్, శ్రీనివాస్, విగ్నేష్, హరికృష్ణ, మల్లేష్, వివేక్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిన్నా శ్రీనివాస రెడ్డి విలువైన డాక్యుమెంట్లు మిస్సింగ్

### - కొత్త ఇంటికి మారిన సమయంలో కీలక పత్రాలు అదృశ్యం

### - మేడ్చల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసిన ఒరిజినల్ డీడ్ లాస్

### - వ్యక్తిత్వం, ప్రవర్తనపై ఎటువంటి అనుమానాలు లేవని ధృవీకరణ

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 10, సత్యమేవ జయతే ప్రతినిధి:- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కొంపల్లికి చెందిన వ్యాపారవేత్త జిన్నా శ్రీనివాస రెడ్డి ( 56 ) విలువైన ఆస్తి పత్రాలు తప్పిపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది.స్ప్లెండిడ్ అపర్ణ పామ్ మెడోస్, విల్లా నం. 141లో నివసిస్తున్న శ్రీనివాస రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2005 జూన్ 29న, మేడ్చల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో "డాక్యుమెంట్ నం. 8528/2005"గా నమోదు చేసిన అసలు ఆస్తి పత్రాలు కొత్త ఇంటికి మారుతున్న సందర్భంగా 2025 ఆగస్టు 23న పోయాయి. కుటుంబ సభ్యులు, సిబ్బంది కలసి విస్తృతంగా శోధించినప్పటికీ, ఆ డాక్యుమెంట్లు ఎక్కడా లభించలేదు. అవి తప్పిపోయి ఉండవచ్చో లేదా ప్రమాదవశాత్తు ధ్వంసమై ఉండవచ్చోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస రెడ్డి వ్యక్తిత్వం, ప్రవర్తన పట్ల ఎటువంటి అనుమానాలు లేవని, ఆయనపై క్రిమినల్ కేసులు లేవని ధృవీకరణలో స్పష్టం చేశారు. అలాగే, తాను ప్రకటించిన వివరాలు నిజమైనవని, ఎటువంటి విషయాన్ని దాచలేదని తన ప్రకటనలో పేర్కొన్నారు.



भारतीय गैर न्यायिक

बीस रुपये रु.20 Rs.20 TWENTY RUPEES

INDIA NON JUDICIAL

తెలంగాణ तेलंगाना TELANGANA 42AA 406938

Date: 09 SEP 2025

Purchased By: J SRINIVAS REDDY S/o THIRUPATHI REDDY R/o KOMPALLY

For Whom: ** SELF **

BADAVATH YAKUB LICENSED STAMP VENDOR ... KOMPALLY, MEDCHAL MALKAJGIRI DISTRICT

**Affadvit**

**MISSING DOCUMENT**

I **JINNA SRINIVAS REDDY, S/o THIRUPATHI REDDY,** aged about 56 years, Occupation: Business , residing at Villa No 141, Splendid Aparna Palm Meadows, Kompally, Medchal-Malkajgiri District, Telangana State, PIN: 500014 we do hereby solemnly affirm and declare as under is true and best of my Knowledge :-

That I **JINNA SRINIVAS REDDY** Aged about 56 years My Original Linked Documents **1. Document No. 8528 of 2005, dated 29/06/2005**, Registered at the Office of the Sub-Registrar, Medchal, Ranga Reddy District.

Documents were lost on 23rd August 2025 While Shifting to our New House Despite a thorough search, I have been unable to locate them and suspect they may have been misplaced or accidentally destroyed.

I further wish to state that the character and conduct of **JINNA SRINIVAS REDDY** is good and he/she has no criminal cases. That the above facts are true and correct to my Knowledge there is no concealment or suppression of face as stated above to best of my belief

Sworn and signed before me.

ATTESTED

SHAIK JAKEER HUSSAIN ADVOCATE & NOTARY Appointed by the Govt. of India H. No: 12-4-74/E, Moosapet

DEPONENT

# డబుల్ రోడ్డు త్వరలోనే మంజూరు అవుతుంది -

### సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ ముడుగుంటలు నుండి సిర్గాపూర్, చాప్ట%ని% గ్రామానికి డబుల్ రోడ్డు-బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షులు దశరథ్

సత్య మేవ జయతే బినారాయణ ఖేడ్‌నారాయణఖేడ్ మండలంలోని ముడుగుంటలు నుండి సంజీవనరావుపేట మీదుగా సిర్గాపూర్ నుండి చాప్ట%ని% గ్రామానికి డబుల్ రోడ్డు మంజూరు చేయాలనీ గతంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కి గతంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప ద్వారా వినతి పత్రం ఇవ్వడంతో ఇప్పుడు మంజూరు అయందుకు బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, మండల అధ్యక్షులు దశరథ్ సంజీవనరావుపేట గ్రామ తాజామాజీ సర్పంచ్ ఎంబారి విఠల్ అన్నారు.అలాగే నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లకు కూడా త్వరలోనే గ్రామ సడక్ యోజన ద్వారా రోడ్లు వేసేందుకు కూడా మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్,ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సహకారంతో గ్రామ సడక్ యోజన ద్వారా నారాయణఖేడ్ నుండి అనంతసాగర్, బంద్రంపల్లి కి కూడా రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువమోర్చ అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్,మండల ప్రధాన కార్యదర్శి కానికేందర్ మండల ఉపాధ్యక్షులు నవీన్,మేకల జ్ఞానేశ్వర్, యువ మోర్చా మండల అధ్యక్షులు భూంరాజ్, విష్ణు,యాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించవద్దని నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో గిరిజనుల నిరసన

సత్య మేవ జయతే. బినారాయణ ఖేడ్‌లినారాయణఖేడ్ మండల మాజీ జెడ్పిటిసి రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించవద్దని బుధవారం నారాయణఖేడ్ నియోజకవర్గం లో నిరసన కార్యక్రమం చేపట్టారు ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ సోయం బాపూరావు మరియు తేళ్ళాం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరియు నాయకులు లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినారు ఈ పిటిషన్ పై సుప్రీంకోర్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయవలసిందిగా కోరారు ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి గాడిదలపై ఊరేగింపి దిష్టిబొమ్మలు దహనం చేసినారు లంబాడాలను రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చారు కానీ ఈ కాంగ్రెస్ నాయకులు మరియు ప్రభుత్వం లంబాడాలను ఎస్టీ జాబితాలోంచి తొలగించి వారికి తీవ్ర అన్యాయాన్ని చేయాలని చూస్తున్నారు.

లిస్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మరియు జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ శ్రీ సురేష్ కుమార్ షెట్కర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లంబాడోళ్ళ పక్షాన పోరాడవలసిందిగా కోరారు.




లంబాడాల రిజర్వేషన్లను తొలగించిన ఎడల తీవ్ర అన్యానికి లోనవుతారని మరియు 70 మంది ఎమ్మెల్యేలను, 8 మంది ఎంపీలను గెలుపోటములపై ప్రభావం చేసే సత్తా లంబాడలకు కలదు అన్నారు మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 12లక్షల పైచీలుకు జనాభా ఉందన్నారు వెంటనే వారి పిటిషన్ వెనక్కి తీసుకొని లంబాడాలకు న్యాయం చేయవలసిందిగా కోరారు లేదంటే రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయక్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, రాజు నాయక్, సర్దార్ నాయక్, రాజు నాయక్, మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే

గురువారం 11 సెప్టెంబర్ 2025

## ప్రతి బూత్ బి ఏ ల్ ఏ ను నియమిచాలి..

## రెవిన్యూ అధికారి మంగీలాల్....



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి బూత్ నుంచి ఒక బూత్ ఏజెంట్ నియమిచాలి జిల్లా రెవిన్యూ అధికారి మంగీలాల్ అన్ని రాజకీయ పార్టీలకు సూచించారు. కలెక్టర్ నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ డబుల్ ఓట్లు ఉన్నట్లయితే దృష్టి కి తీసుకురావాలని నాయకులకు తెలిపారు.వికారాబాద్ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అనిత.ఈ సమావేశం లో పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ఈ నెల 13 న జాతీయ లోక్ అదాలత్..వికారాబాద్ సీఐ బీమ్ కుమార్...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..“రాజీ మార్గమే రాజమార్గం. పోరాడితే ఒక్కడే గెలుస్తారు, రాజీపడితే ఇద్దరూ గెలుస్తారు.”

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, కోర్టులలో పెండింగ్లో ఉన్న కేసుల సామరస్య పరిష్కారానికి మరియు సత్వర న్యాయం అందించేందుకు, తేదీ 13 సెప్టెంబర్ 2025 న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించబడనుంది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ లోక్ అదాలత్లో వివిధ రకాల కేసులు, ముఖ్యంగా పాత పెండింగ్ కేసులు, పరస్పర ఒప్పందం ద్వారా త్వరితంగా పరిష్కరించబడతాయి. ప్రజలు తమ కేసులను సామరస్యంగా పరిష్కరించుకునే ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇరు వర్గాల అంగీకారంతో సత్వర పరిష్కారం పొందవచ్చు. మరింత సమాచారం కోసం పోలీస్ అధికారులను సంప్రదించండి..

## పట్టణాభివృద్ధికి ఫోకస్ పెట్టండి..!

**%-% పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహించరాదు.**

**%-% తాండూరు మున్సిపల్ కమీషనర్ యాదగిరి..**

**%-% పట్టణంలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్..**

**అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష.**



.సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..తాండూరు, : పట్టణ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని తాండూరు మున్సిపల్ కమీషనర్ యాదగిరి ఆదేశించారు. బుధవారం ఉదయం కమీషనర్ పట్టణంలోని పలు వార్డులలో మార్నింగ్ వాక్ చేపట్టారు.బసవణ్ణ కట్ట, పాత కూరగాయల మార్కెట్లో పర్యటించారు. ఆయా కాలనీలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అంతకుముందు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల అటెండెన్స్ ను పరిశీలించారు. మరోవైపు కార్యాలయంలో మున్సిపల్ డీఈ, ఏఈలతో పాటు పలు విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులపై దృష్టిసారించాలన్నారు.విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రీన్ బడ్జెట్ కింద పార్కుల అభివృద్ధికి శ్రద్ధ తీతీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా పట్టణంలో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించరాదని, పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని శానిటరీ ఇను స్పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిప మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈ మణిపాల్, ఏఈ ఖాజా హుస్సేన్, ఉదయ్ కుమార్, శానిటరి ఇను స్పెక్టర్లు ఉమేష్, వెంకటయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రియా, అకౌంటెంట్ శివకుమార్, వాణి, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొనారు..

## “తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీ క్రాంతి కిరణ్ జీ నియామకం %-% బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘన సత్కారం. శరద్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథి.”



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీ క్రాంతి కిరణ్ జీ నియమితులైన సందర్భంగా, హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా శరద్ సింగ్ ఠాకూర్ గారు పాల్గొన్నారు.కార్యక్రమంలో సంజయ్ ఘనతే, రాజేష్ గోగికర్ సహా పలువురు గౌరవనీయ నాయకులు హాజరై అభినందనలు తెలిపారు. కొత్తగా రాష్ట్ర అధ్యక్షుడైన క్రాంతి కిరణ్ గారి నాయకత్వంలో బీజేపీ ఎస్సీ మోర్చా మరింత బలోపేతం అవుతుందని, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా పలువురు స్పష్టం చేశారు.

ఈ నియామకంతో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చాలో నూతన ఉత్సాహం నెలకొంది.

# యూరియా కష్టాలు.. సర్కారుకు సిగ్గుచేటు..!

**రైతన్నలను పస్తులుంచే పాపం ప్రభుత్వానిదే**

**-% తెలంగాణలో కాంగ్రెస్ పాలన వైఫల్యం**

**బీసీ కమీషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్**

**బారులు తీరిన రైతులకు పండ్ల పంపిణీ...**

సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..

తాండూరు,.. : తెలంగాణ రాష్ట్రంలో రైతులను యూరియా కోసం బారులు తీరేలా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని, ఉదయం నుంచే అన్నదాతను పస్తులు పాలు చేసిన పాపం ఈ ప్రభుత్వానిదే అని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యులు నూలి శభప్రద్ పటేల్ విమర్శించారు.

బుధవారం తాండూరు పట్టణంలోని ఎల్మకన్నె సహాకార సంఘం కార్యాలయం వద్ద యూరియా బస్తాల కోసం బారులు తీరిన రైతులను శుభప్రద్ పటేల్ పలకరించారు. ఉదయం నుంచి తిండి తిప్పలు మాని పస్తులు ఉన్న రైతులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయంలో 'రైతుల కోసం అందుబాటులో ఉన్న యూరియా బస్తాల నిల్వలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతులకు యూరియా బస్తాల కొరత ఏర్పడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు.



గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో రైతులకు యూరియా కష్టాలు రాకుండా చూశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రోడ్డు ఎక్కేలా, బారులు తీరేలా పరిస్థితులు తీసుకరావడం సిగ్గుచేటన్నారు. యూరియా బస్తాల కోసం రైతులు తిండి తిప్పలు మాని పస్తులుంచేలా చేసిన పాపం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే వస్తుందని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లలలో యూరియా బస్తాలు నిల్వ ఉంచుకుని, రైతులను పడిగాపులు పడేలా చేస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు యూరియా బస్తాలను అందించాలని, లేదంటో మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాను. ఆబీద్ చావుస్, సాయికుమార్, మల్లేశం. శ్రీధర్. మనోహర్ తదితరులు ఉన్నారు..

# సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు రాజీ**

**కుదుర్చుటకు పోలీస్ అధికారులు సహకరించాలి**

**ఎం. హేమలత,జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్**

**మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్**

సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్

సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకొని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల ప్రకారం, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేయుటకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది,

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఎం. హేమలత. జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ వీరు మాట్లాడుతూ కక్షిదారులు గ్రామీణ ప్రాంతాల్లో క్షణికావేశంలో ఇరువర్గాలు తగదా పడి కోపతాపాలు పెంచుకొని పరస్పరం కేసులు నమోదు చేయించుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోవడం కంటే రాజీ చేయదగ్గ కేసులలో ఇరు వర్గాలు జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోనుటకు సెప్టెంబర్ 13 నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను కక్ష దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు, జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు నర్సాపూర్




కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

రాజీ చెయ్యదగ్గ కేసులలో కక్షిదారులు రాజి కుదుర్చుకొనుటకు పోలీస్ అధికారులు న్యాయవాదులు సహకరించాలన్నారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.రాఘవేందర్, పి.సుధాకర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది. నర్సాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ లింగం, శివంపేట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిహెచ్. మధుకర్ రెడ్డి, చిలప్ చెడు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే. నర్సింలు, లోక్ అదాలత్ న్యాయవాది, లీగల్ సర్వీస్ న్యాయవాది బి. స్వరూప రాణి, సీనియర్ న్యాయవాది ఈ. సత్యనారాయణ, సాయిరాం, న్యాయవాదులు, లీగల్ సర్వీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, కోర్టు పోలీస్ కానిస్టేబుల్స్, కక్షిదారులు పాల్గొనడం జరిగింది.

# కొత్త భవనాల నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయించాలి

**పాఠశాల, హాస్టల్ భవనాల స్టాండర్డ్స్ ను వెంటనే పరిశీలించాలి**

**విద్యార్థులు ఉండేందుకు ప్రత్యామ్నాయం చూడాలి**

**కొత్త భవనాల నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయించాలి**

సత్య మేవ జయతేనారాయణ ఖేడ్

ఈ సందర్భంగా నారాయణఖేడ్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ ,కౌరారి నర్సింలు సహాయ కార్యదర్శి గణపతి అంబేద్కర్ సంఘం నారాయణఖేడ్ తాలూకా అధ్యక్షులు కాన్సిరాం లు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి ఆశ్రమ పాఠశాల హాస్టల్ బిల్డింగ్ కుప్పకూలిన సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భారీ వర్షాలకు గోడలన్నీ తడిసి కుప్పకూలినట్టు అర్థమవుతుంది. ఇటువంటి సమయంలో భారీ వర్షాలు పడిన సమయంలో పాతకాలం నాటి కట్టడాలను వాటి సామర్థ్యాన్ని పరీక్షించాల్సిన అధికారులు నిర్లక్షంగా వ్యవహరించడం వల్లనే ఈ భవనం కుప్పకూలిందనేది చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. స్కూలు నడుస్తున్న సమయంలో హాస్టల్ భవనం



కూలిపోవడంతో పిల్లలకు ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఒకవేళ రాత్రిపూట కూలిపోయి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది.. ఇప్పటికైనా ప్రభుత్వ హాస్టల్లో శిథిలావస్థకు చేరిన భవనాల లిస్టు తయారుచేసి వాటి సామర్థ్యాన్ని పరీక్షించి అక్కడి విద్యార్థులని ఉంచడమా లేదా తరలించడం లాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. గాయపడిన ముగ్గురు విద్యార్థులు జహీరాబాద్ హాస్పిటల్ లో చేసిత్స పొందుతున్నారని తెలిసింది మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని కెవిపియస్ నారాయణఖేడ్ కమిటీ డిమాండ్.

ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఉమెన్ రైట్స్ అధ్యక్షులు డాక్టర్ బాబు రాహుల్ రాకేష్ భాను సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# దేవరకద్ర నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల విలేఖరుల సమావేశం

సత్యమేవ జయతే – దేవరకద్ర

దేవరకద్ర : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు, మాజీ యంఎల్ఎ అలా వెంకటేశ్వర్ రెడ్డి గారు స్థానిక శాసనసభ్యులు %+%. మధుసూదన్ రెడ్డి గారి పై, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలకు ప్రతిస్పందిస్తూ కాంగ్రెస్ నాయకులు ఈరోజు దేవరకద్రలో విలేఖరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ:

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి పై నమోదైన కేసుకు యంఎల్ఎ మధుసూదన్ రెడ్డి గారికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

నర్సింహా రెడ్డి ప్లాట్ వ్యవహారంలో కొంతమందికి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసారని, పోలీసులు విచారణ జరిపి చట్ట ప్రకారం కేసు నమోదు చేశారని తెలిపారు.

“బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి వల్ల కేసు పెట్టారని చెప్పడం అసత్యం” అని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు.




ఒకవేళ యంఎల్ఎ గారు ఒత్తిడి చేసి పార్టీలో చేర్చుకోవాలనుకుంటే, నర్సింహా రెడ్డి యంఎల్ఎ వద్ద సహాయం కోరిన సందర్భాల్లోనే ఆ ఒత్తిడి తెచ్చేవారమని, కానీ యంఎల్ఎ గారు సహృదయంతో సహాయం చేశారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి విషయంలో కూడా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని, గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం 20 నెలల్లో %+%. మధుసూదన్ రెడ్డి గారి నాయకత్వంలో జరిగిన అభివృద్ధి పై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త అరవింద్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బలుసుపల్లి లక్ష్మికాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారూక్ అలీ, దేవస్థానం చైర్మన్ నర్సింహా రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, నాయకులు ఆది హన్మంత్ రెడ్డి, కొండ అంజన్ కుమార్ రెడ్డి, కుర్వ రాంపండు, కమ్మరి బాలస్వామి, నర్వ శ్రీనివాస్ రెడ్డి, గొల్ల శ్రీను, మున్నూరు బాలరాజు, చంద్రయ్య, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



## మహబూబ్ నగర్ పట్టణ అభివృద్ధి దిశగా మరో ముందడుగు





% సత్యమేవ జయతే – మహబూబ్ నగర్ మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ నగరంలోని టిడి గుట్ట నుంచి కొత్త చెరువు రోడ్ వరకు సుమారు ₹35 లక్షల ముడా నిధులతో నిర్మించనున్న సిసి రోడ్ నిర్మాణ పనులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ %–

%మహబూబ్ నగర్ నగరంలోని ప్రతి డివిజన్‌లో సిసి రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

గత పదేళ్లుగా మహబూబ్ నగర్ పట్టణ అభివృద్ధి వెనుకబడి పోయిందని, ఇప్పుడు పట్టణాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.

ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతులను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో %–

%ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్. పి. వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మహమ్మద్ మునీర్, చిన్న, ఖాజా పాషా, రాషెద్ ఖాన్, ప్రశాంత్, శ్రీను, నాయకులు ఫక్రు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మన హక్కుల కోసం పోరాడుదాం-బొట్ల మనోహర్

**- బహుజన విద్యార్థి సంఘం (బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి**



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగమై దొరల గుండెల్లో సింహస్వప్నమై తెలంగాణ పౌరుషాన్ని త్యాగాన్ని పోరాటాన్ని భావి తరాలకు అందించిన పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని బి.యస్.ఫ్ కె.యూ ఇంచార్జి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ అన్నారు.బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా కె. యూ మొదటి గేట్ ముందు బి.యస్.ఫ్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బొట్ల మనోహర్ మాట్లాడుతూ అణిచివేతల స్వభావం కల్గిన నిజాం నిరంకుశ రజాకార్ల మూకలపై అణగారిన వర్గాల మహిళగా ఆమె చేసిన యుద్ధం,దున్నే వాడిదే భూమి,పండించిన పంటపై హక్కు మాదే నంటూ నడిపిన పోరాటం,చూపిన ధైర్యసాహసాలు, ఉద్యమించిన తీరును, ప్రదర్శించిన ధీరత్వము అంతా చారిత్రాత్మకమైనదని అన్నారు. చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని వారిని రజకులే కాదు తెలంగాణలో పుట్టిన సబ్బండ వర్గాలు ఆమెను స్మరించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మట్టి మనుషుల ప్రతిరూపానికి, తెలంగాణ చైతన్యానికి, పోరాటానికి, మహాజన మహిళల ధీరత్వానికి తను సింబల్ అని కొనియాడారు.

రజకులు రాయితీల కోసమో, సబ్సిడీల కోసం పరితపించడం కాదు రాజ్యాధికారంలో భాగస్వామ్యమైనప్పుడే చాకలి ఐలమ్మకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళం అవుతామని,ఆదిశగా మన వర్గాలను చైతన్యం చేస్తూ సమగ్ర అభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.పీడిత వర్గాల విముక్తి కోసం ముందుకు నడవాలని,పేదరికము, అణిచివేతలు,దోపిడి,పీడన, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో బి.యస్.ఫ్ నాయకులు కడదారపు నవీన్ వైనాల సాత్విక్ మామిడి సాయి కుమార్ ముత్యం విజయ్ వరుణ్ అఖిల్ గణేష్ మధుకర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉత్తరాఖండ్‌లో ప్రధాని మోడీ పర్యటన



డెహ్రాడూన్ : ప్రధాని నరేంద్రమోడీ ఉత్తరాఖండ్‌లో గురువారం పర్యటించనున్నారు. ఉత్తరాఖండ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేయనున్నారు. అనంతరం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆ రాష్ట్రంలో పరిస్థితి తెలుసుకుంటారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ జోలీ గ్రాంట్ ఎయిర్‌పోర్టు దగ్గర ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల ఉత్తరాదితోపాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, తదితర రాష్ట్రాల్లో వరదలు పోటెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఆయా రాష్ట్రాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# నైపుణ్య శిక్షణ లో మనమే ఫస్ట్ : ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**- కోటి రూపాయల ముడా నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- సిసి రోడ్లు, కామన్ షెడ్, నైపుణ్య శిక్షణ కేంద్రాలకు శంకుస్థాపన**

**- మయూరి కో ఆపరేటివ్ సొసైటి ఏర్పాటు చేస్తాం**





సత్యమేవ జయతే – మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ : అత్యధికంగా మహిళలు నైపుణ్య శిక్షణ పొందుతున్నది మన మహబూబ్ నగర్ లోనే అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్ నగర్ నగరం లోని వీరన్న పేట, సిరాజ్జుద్దిన్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో 38.20 లక్షల రూపాయల ముడా నిధులతో నూతనంగా నిర్మించనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణపు పనులకు గౌరవ ఎమ్మెల్యే గారు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ నగరంలో ఈరోజు సుమారు కోటి రూపాయల ముడా నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. మహిళలకు నైపుణ్య శిక్షణ ఇప్పించి వాళ్ళమీద వాళ్ళు నిలబడేవిధంగా తోడ్పాటు అందించే ప్రయత్నాన్ని మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నగరంలోని బికె రెడ్డి కాలనీ లో ఇప్పటికే వెయ్యి మంది మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇప్పించామని ఆయన చెప్పారు. తెలంగాణ లోని మహిళలందరికీ ప్రభుత్వం అండగా ఉంటూ ఆదుకుంటుందని ఆయన చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీకి రుణాలు ఇస్తున్నామన్నారు. మహబూబ్ నగర్ లో ఉన్న 30 వేల మంది మహిళా సంఘాల సభ్యులతో కలిసి మయూరి కో ఆపరేటివ్ సొసైటి ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా మీరు తయారు చేసే అన్ని రకాల వస్తువులను మయూరి సొసైటీ ఆధ్వర్యంలో విశ్వవ్యాప్తం చేస్తామన్నారు. ఈ నైపుణ్య శిక్షణ కేంద్రం పూర్తి కాగానే వీరన్న పేట పరిసర ప్రాంతాల్లో ఉన్న అన్ని వార్డుల్లోని మహిళలు ఈ శిక్షణ సెంటర్ లో తప్పక శిక్షణ పొందాలని అందుకు సంబంధించి శిక్షణ రుసుమును నేనే చెల్లిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

తెలంగాణలో మహబూబ్ నగర్ అన్నింట్లో నెంబర్ వన్ గా ఉండాలని , అందుకే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంచి ఆలోచన చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం అని తెలిపారు. మీ ఆశీర్వాదం ఉంటే ఇంకా మరెన్నో అభివృద్ధి పనులు మీమీ కాలనీల్లో చేస్తామని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు కానీ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు పేదలకు ఇస్తుందన్నారు. మన మహబూబ్ నగర్ నియోజకవర్గంలోనే 3,500 ఇందిరమ్మ ఇండ్లుమను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటికే అందులో చాలా ఇండ్లు నిర్మాణం జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఎవరికైనా పెంకుటిల్లు లేదా రేకుల ఇండ్లు ఉంటే ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల రూపాయలతో పక్కా ఇల్లు కట్టుకోవాలని ఆయన సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా ప్రతి ఒక్కరికి నిత్యం చేతినిండా పనులు దొరుకుతున్నాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి , మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మోసిన్, మహమ్మద్ మునీర్ , చిన్న, ఖాజా పాషా , రాషెద్ ఖాన్, ప్రశాంత్, లక్ష్మణ్ నాయక్, షేక్ ఉమర్ , అంజద్,నాయకులు లీడర్ రఘు, ఫైసల్, జగదీష్ , తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ముదిరాజ్ పోరాట సమితి బహిరంగ సభ

**కరీంనగర్‌లో టీఎంపీఎస్ బహిరంగ సభలో నీలం మధు ముదిరాజ్ కీలక ప్రసంగం చేశారు**







సత్యమేవ జయతే – కరీంనగర్

కరీంనగర్ : మరాఠా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్దాం.. భావి తరాల కోసం కలిసి నడుద్దాం.. రాజ్యాధికారం వస్తేనే జాతి అభివృద్ధి.. స్థానిక ఎన్నికల్లో అన్ని పార్టీలు జనాభా ప్రకారం సీట్లు ఇవ్వాలి... ముదిరాజుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది.. మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ కృషి.. మన ఓట్లతో పాటు అన్ని వర్గాలను కలుపుకొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం.. డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలతో జెఏసి : నీలం మధు ముదిరాజ్.. ఉమ్మడి కరీంనగర్ లో టిఎంపిఎస్ బహిరంగ సభ... వేలాదిగా హాజరైన జనం.. భారీ ర్యాలీతో నీలంకు ఘన స్వాగతం.. అందరం కలిసి ముందుకు నడిస్తేనే భావితరాల అభివృద్ధి సాధ్యపడుతుందని మన జాతి యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయిలోకి రావాలంటే పార్టీలకతీతంగా ఏకమై అన్ని వర్గాలను కలుపుకొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి (టీఎంపీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ముదిరాజ్ జాతి హక్కుల సాధనకు టీఎంపీఎస్ పని చేస్తుందని అన్నారు, ఉద్యమాలకు పురిటిల్లైన కరీంనగర్ లో టీఎంపీఎస్ వారు బహిరంగ సభ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా ముదిరాజుల దీర్ఘ కాలిక డిమాండ్లైన బి సి డి నుంచి బీసీ ఏ లోకి మార్చే ప్రక్రియతో పాటు ముదిరాజ్ జాతి బిడ్డలను రాజకీయంగా చైతన్యం చేసే ప్రక్రియలో భాగంగా టిఎంపిఎస్ పనిచేయడం అభినందనీయమన్నారు. మన భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించాలంటే మనమంతా ఏకమవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ముదిరాజ్ జాతి మనగడం కోసం మన హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘాలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి ఉద్యమించాలని కోరారు. అందుకు ప్రతి ముదిరాజ్ బిడ్డ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు మన జాతి బిడ్డలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు చేశారని ఆ కుట్రలను చేధించుకుని మనం రాజకీయంగా ఎదగాలన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో మెజార్టీగా ఉన్న ముదిరాజులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి ఎంపీపీలుగా, జడ్పిటిసిలుగా సర్పంచులు గా రాణించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పది నుంచి 15 మంది ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా మన జాతి బిడ్డలు పోటీ చేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. మన హక్కుల సాధన తో పాటు రాజకీయంగా మన జాతి బిడ్డలు రాణించాలంటే అన్ని సంఘాలు రాజకీయ జేఏసీగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకు మేధావులు మిగిలిన సబ్బండ కులాల మద్దతు తీసుకుని అన్ని వర్గాలను కలుపుకొని రాజకీయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. మరాఠా ఉద్యమ స్ఫూర్తితో సౌత్ ఇండియాలోని మత్స్యకారులంతా ఏకమై ఉద్యమిస్తే మన జనాభాకు తగ్గట్లు రిజర్వేషన్ సాధించుకోవచ్చని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిసారి మన ముదిరాజుల అభ్యున్నతి కోసం కృషి చేయడమే కాకుండా మన బిడ్డలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాడని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో మన ప్రధాన డిమాండ్ అయిన బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే ప్రక్రియ ను ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. అందుకుగాను త్వరలో మన జాతి మేధావులు, వ్యాపారులు, సంఘాలతో కలిసి ముఖ్యమంత్రిని కలుద్దామని అన్నారు. అదేవిధంగా మత్స్యకారులకు పెన్షన్ అందించే విధంగా కృషి చేస్తానన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. మన జాతి బిడ్డలకు ఎప్పుడు ఎలాంటి సహకారం కావాలన్నా ముందుండి అందించడానికి తను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్, మత్స్య సహకార సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కొలిపాక నరసయ్య,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కూనంచుల మహేందర్, కొలిపాక శ్రీనివాస్, టీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉప్పర వేణి రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాషబోయిన శేఖర్,కీసర సంపత్,జిల్లా మత్స్య సహకార సంఘాల చైర్మన్ పిట్టల రవీందర్, వైస్ చైర్మన్ కుమారస్వామి, సిరిసిల్ల అధ్యక్షులు చుక్కల రాము, సిద్దిపేట అధ్యక్షులు చెందు శ్రీనివాస్, టీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి జోగిని రవి, ఉపాధ్యక్షులు అట్టెం రమేష్, అశోక్, బోయిన దేవరాజు, కార్యదర్శి రవి, ప్రవీణ్, నరసింహులు, పండుగ స్వామి, వేలాదిగా పాల్గొన్న మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు..

సత్యమేవ జయతే



**: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మన హక్కుల కోసం పోరాడుదాం-బొట్ల మనోహర్**

**- బహుజన విద్యార్థి సంఘం (బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి**





సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగమై దొరల గుండెల్లో సింహస్వప్నమై తెలంగాణ పౌరుషాన్ని త్యాగాన్ని పోరాటాన్ని భావి తరాలకు అందించిన పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని బి.యస్.ఫ్ కె.యూ ఇంచార్జి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ అన్నారు.బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా కె. యూ మొదటి గేట్ ముందు బి.యస్.ఫ్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బొట్ల మనోహర్ మాట్లాడుతూ అణిచివేతల స్వభావం కల్గిన నిజాం నిరంకుశ రజాకార్ల మూకలపై అణగారిన వర్గాల మహిళగా ఆమె చేసిన యుద్ధం,దున్నే వాడిదే భూమి,పండించిన పంటపై హక్కు మాదే నంటూ నడిపిన పోరాటం,చూపిన ధైర్యసాహసాలు, ఉద్యమించిన తీరును, ప్రదర్శించిన ధీరత్వము అంతా చారిత్రాత్మకమైనదని అన్నారు. చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని వారిని రజకులే కాదు తెలంగాణలో పుట్టిన సబ్బండ వర్గాలు ఆమెను స్మరించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మట్టి మనుషుల ప్రతిరూపానికి, తెలంగాణ చైతన్యానికి, పోరాటానికి, మహాజన మహిళల ధీరత్వానికి తను సింబల్ అని కొనియాడారు.

రజకులు రాయితీల కోసమో, సబ్సిడీల కోసం పరితపించడం కాదు రాజ్యాధికారంలో భాగస్వామ్యమైనప్పుడే చాకలి ఐలమ్మకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళం అవుతామని,ఆదిశగా మన వర్గాలను చైతన్యం చేస్తూ సమగ్ర అభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.పీడిత వర్గాల విముక్తి కోసం ముందుకు నడవాలని,పేదరికము, అణిచివేతలు,దోపిడి,పీడన, అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో బి.యస్.ఫ్ నాయకులు కడదారపు నవీన్ వైనాల సాత్విక్ మామిడి సాయి కుమార్ ముత్యం విజయ్ వరుణ్ అఖిల్ గణేష్ మధుకర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బానిసత్వానికి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చిట్కుల్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు





% సత్యమేవ జయతే - సంగారెడ్డి సంగారెడ్డి : తెలంగాణ తొలి భూపోరాట వీరవనితగా చరిత్రలో నిలిచిన చాకలి ఐలమ్మ నిజాం రజాకార్ల నిరంకుశత్వానికి, బానిసత్వానికి, అణచివేతలకు ఎదురొడ్డి పోరాడిన ఉద్యమ కాగడా అని ఆయన గుర్తు చేశారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో ప్రతిష్టించిన ఐలమ్మ కాంస్య విగ్రహం వద్ద పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ %-

%“తెలంగాణ చరిత్రలో చిట్యాల ఐలమ్మ పాత్ర వెలకట్టలేనిది. బడుగు జీవుల అస్థిత్వాన్ని పరిరక్షించేందుకు, సమానత్వం కోసం బందూకులు పట్టి పోరాడిన ఆమె వీరనారి. ఆమె స్ఫూర్తితో మనమంతా ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. భావితరాలకు ఐలమ్మ స్ఫూర్తి అందించాలన్న సంకల్పంతో చిట్కుల్ గ్రామంలోనే రాష్ట్రంలో అతి పెద్ద కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించాం” అని తెలిపారు.

అదే విధంగా సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ హక్కులు, ఉద్యోగ అవకాశాల కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ అసెంబ్లీలో రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదింపజేసిందని నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్, సత్తయ్య, బాబు, కిషోర్, రజక సోదరులు, మాజీ %ూాజూ% చైర్మన్ నారాయణ రెడ్డి, ఆంజనేయులు, అశోక్, లింగం, లక్ష్మణ్, ప్రవీణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్లలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన





సత్యమేవ జయతే - రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఘనంగా పర్యటించిన కార్మిక, ఉపాధి శిక్షణ మరియు భూగర్భ గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి గారు భారీ ర్యాలీ అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగించారు. సిరిసిల్ల జౌళి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తూ, బీఆర్ఎస్ దశాబ్ద పాలనలో ప్రజల సమస్యలను పక్కనబెట్టి కుటుంబం కోసం మాత్రమే పనిచేశారని విమర్శించారు. సాండ్ మాఫియా వల్ల దళితులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావించారు.

కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఆధునిక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి, రెండు సంవత్సరాల్లో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల నీరు అందలేదని, కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు, దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. చివరగా, తన తండ్రి పట్ల ప్రజలు చూపిన ప్రేమకు మంత్రి గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మిమ్మల్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టేది చదువు ఒక్కటే : ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో ఎప్సెట్ మరియు నీట్ ఎంట్రెన్స్ శిక్షణ**

**- అట్టహాసంగా ప్రారంభమైన పయనీర్ కార్యక్రమం**

**- అవకాశాన్ని అందిపుచ్చుకుంటామన్న విద్యార్థులు**

**- 100% అటెండెన్స్ ఉన్న విద్యార్థులకు 10116 /- రూపాయల నగదు ప్రకటించిన రిషి విద్యాసంస్థల డైరెక్టర్ వెంకటయ్య**






సత్యమేవ జయతే - మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ : మిమ్మల్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టేది కేవలం చదువు ఒక్కటే అని విద్యార్థులను ఉద్దేశించి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పయనీర్ - ఎప్సెట్ మరియు నీట్ ఎంట్రెన్స్ టెస్ట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు కాబోతున్న మీ భవిష్యత్తు గురించి నేను నిరంతరము ఆలోచన చేస్తున్నానన్నారు . గత 20 నెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో ఎప్సెట్ మరియు నీట్ ఎంట్రెన్స్ శిక్షణ తరగతులను సొంత నిధులతో నిర్వహిస్తున్నామని, గత విద్యాసంవత్సరం పయనీర్ కార్యక్రమం లో అద్భుతమైన ఫలితాలు విద్యార్థులు సాధించారని, 200 మంది విద్యార్థులు శిక్షణ తీసుకొనగా, 116 మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి వివిధ ప్రొఫేషనల్ కోర్సుల్లో చేరారని , ఈ విద్యా సంవత్సరం వంద శాతం ఉత్తమ ర్యాంకులను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఇక్కడ పుట్టిన బిడ్డలు ఇక్కడనే చదువుకోవాలి అని మీకోసం అగ్రికల్చర్ కళాశాల, బి ఫార్మసీ, డి ఫార్మసీ కళాశాల ఇంకో పాలిటెక్నిక్ కళాశాలను మహబూబ్ నగర్ కు తెచ్చేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రానున్న నాలుగు ఐదు సంవత్సరాల కాలంలో సుమారు మన మహబూబ్ నగర్ నుంచే 10 వేల మంది ఇంజనీర్లు తయారు కాబోతున్నారని వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మహబూబ్ నగర్ చుట్టూ అనేక పరిశ్రమలు తెచ్చేందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, నేను కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్మీడియట్ లో రెండు సంవత్సరాల పాటు కష్టపడి చదివి మంచి ప్రొఫెషనల్ కోర్సులలో స్థిరపడితే జీవితంలో ఇక వెనక్కి తిరిగి చూసే పరిస్థితి ఉండదన్నారు. పయనీర్ కార్యక్రమం లో వంద శాతం హాజరు ఉన్న విద్యార్థులకు 10,116/- రూపాయల నగదును ఇస్తానని రిషి విద్యాసంస్థల డైరెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిజె బెనహర్, డిఐఇఓ కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, ప్రభుత్వ ఎంవిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భీం రెడ్డి, ఒకేషనల్ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ జంగయ్య, రిషి విద్యాసంస్థల డైరెక్టర్ వెంకటయ్య, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్.. ఇక దేశవ్యాప్తం

న్యూఢిల్లీ : ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో ఆరంభం కానుం ది. దీనికి సంబంధించిన ప్రకటనను ఎన్నికల సం ఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముగింపునకు ముం దే అధికారికంగా ప్రకటించవచ్చు. ఈ విషయాన్ని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. బీహార్‌లో ఇతర చోట్ల చేపట్టిన సర్ ప్రక్రియపై వివాదాలు ర గులుకున్నాయి. పైగా సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు దాఖలు అయ్యాయి. వీటితో సంబంధం లేకుండా సర్ ప్రక్రియను తమ ఎన్నికల నిర్వహణ క్రమంలో చేపడుతారని ఎన్నికల సంఘం తెలిపింది. లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే ఓటర్ల జాబితాల సవరణలను చేపట్టడం ఆనవాయితీగా ఉంది. ఈ ఏడాది చివరిలో బీహార్‌లో ఎన్నికలు పూర్తి కావల్సి ఉంది. వచ్చే ఏ డాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల సంఘం ప్రధానాధికారులు (సిఇఒ)లతో కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం కీలక సమావే శం నిర్వహించింది.

ఇందులో ఓటర్ల జాబితా సవరణల విషయం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. అన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎటువంటి వి వాదాలకు తావు లేకుండా సర్ ప్రక్రియను పూర్తి చే యాల్సి ఉందని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ మధ్యలో సర్‌ను ఆరంభించాలనే ప్రతిపాదనకు అన్ని రాష్ట్రాల సిఇఒల నుంచి సమ్మ తి దక్కింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలు, యుటిల లో క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల సవరణ చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించారు. బీహార్‌లో మాదిరిగానే అన్ని రాష్ట్రాల్లో, యు టిలలో సర్‌ను చేపట్టాలని నిర్ణయించారని అధికారులు తెలిపారు. బుధవారం సంబంధిత విషయం పై సదస్సుతో పాటు వర్క్‌షాప్ కూడా జరిగింది. ఇందులో సర్ నిర్వహణకు అవసరం అయిన మా ర్గదర్శక సూత్రాలను గురించి విశ్లేషించుకున్నట్లు తెలిసింది. రాష్ట్రాల వారీగా ఎప్పటిలోగా సర్ నిర్వహణకు అంతా సిద్ధంగా ఉన్నారనేది తెలియచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాల సిఇఒలను ఆరాతీసింది. ఇందుకు తాము ఈ నెలాఖరులోగానే క్షేత్రస్థాయిలో సర్వం సన్నద్ధం అవుతామని వారు చెప్పారు. దీనితో అక్టోబర్ మధ్యలో సర్ నిర్వహణకు రంగం సిద్ధం కావడం ఖాయం అయింది.

క్షేత్రస్థాయిలో సరైన పత్రాలతో ఓటర్ల నమోదు

ఓటర్ల జాబితా సవరణ విషయం అట్టడుగు స్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలను మమేకం చేసుకుంటూ సాగాల్సి ఉంటుంది. అందరికి తగు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ఎటువంటి పత్రాలు రూపొందించాలి? సవరణల దశలో నిజమైన ఓటర్ల నిర్ధారణ ఏ విధంగా నిర్వహించాలనే విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. సర్ దశల్లో ప్రజలకు పంపిణి చేసే కీలక ఫారాల విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రాల వారిగా , ఆయా ప్రాంతాలలో చెల్లుబాటు అయ్యే రీతిలో ప్రజలకు ఈ ప్రక్రియ గురించి సరైన అవగావహన కల్పించాలని కూడా నిర్ణయించారు. ఓటర్ల నిర్ధారణకు స్థానికంగా ఉండే సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకుంటారు. వీటిని బట్టి స్థానికతను నిర్ధారించుకుంటారు. గిరిజన ప్రాంతాలు, తీర ప్రాంతాలలో వేర్వేరుగా జారీ అయ్యే పత్రాలను లెక్కలోకి తీసుకుని వాటి ద్వారా స్థానికులను ఓటర్ల జాబితాల్లో చేరుస్తారు. అనేక ప్రాంతాలలో స్థానిక మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు, స్వయం నిర్ణయాధికారిక మండళ్లు జారీ చేసే నివాస ధృవపత్రాలను లెక్కలోకి తీసుకుంటారు. వీటి ద్వారానే ఓటర్ల జాబితా సమగ్ర స్వరూపం ఏర్పడుతుంది.

మార్గదర్శకాలతో ముందుకు వెళ్లేందుకు సిద్ధం

మృతుల పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉండరాదు. శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారి పేర్లను జాబితాల్లో నుంచి తీసివేయాలి. నకిలీ ఓటర్ల తొలిగింపు , భారతీయ పౌరులు కాని వారిని జాబితాల్లో నుంచి తీసివేయడం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తారు. ఈ క్రమంలో పలు వడబోతల తరువాత సమగ్ర నిక్కచ్చి రీతిలో ఉండే ఓటర్ల జాబితాల ఖరారు ఈ సర్ ప్రక్రియ ఏకైక లక్షం అని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. బీహార్ సర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఆర్జేడీ , టిఎంసి పార్టీలు తీవ్ర నిరసనకు దిగాయి. కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఓట్ల చోరీకి బీహార్ సంకేతంఅని విమర్శించారు. బీహార్‌లో ఈ ప్రక్రియతో బిజెపి వ్యతిరేక ఓటర్లను లక్షలాది మందిని జాబితాల్లో నుంచి తొలిగించారని, బడుగు వర్గాలకు ఓటు హక్కు లేకుండా చేశారని విమర్శించారు. బీహార్‌లో ఓటు హక్కు రక్షణకు ఉద్యమం కూడా చేపట్టారు. అయితే ఎన్నికల సంఘం ఈ విమర్శలను ఖండించింది. ఇవన్నీ కూడా ఎన్నికల సంఘంపై రాజకీయ బురద చల్లడంగా పేర్కొన్నారు.

# రిటైర్ అయ్యి ఇంటి దగ్గర ఉంటున్న వాళ్ల కోసమే ఈ స్పెషల్ సర్వీస్!





మధ్యతరగతి జీవితం.. బాధ్యతల బందిఖానా. చదువు, పెళ్లి, కుటుంబం, పిల్లలు, చదువులు, వాళ్ల వివాహాలు, అంతలోనే రిటైర్మెంట్. ఆ పరుగులో పడిపోయి నాలుగు గోడలే ప్రపంచంగా బతికేస్తారు. అసలుసిసలు ప్రపంచాన్ని దర్శించే అవకాశమే ఉండదు. అరవై తర్వాతబోలెడంత తీరిక ఉన్నా.. ఎక్కడికీ వెళ్లాలనిపించదు. ‘ఓపిక లేకపోవడం అనేది ఓ మానసిక జాడ్యం. మీరు ప్లాన్ చేసుకోండి. మేం తీసుకెళ్తాం’ అంటున్నారు కొందరు టూర్ ఆపరేటర్లు. మధ్యతరగతి జీవితం.. బాధ్యతల బందిఖానా. చదువు, పెళ్లి, కుటుంబం, పిల్లలు, చదువులు, వాళ్ల వివాహాలు, అంతలోనే రిటైర్మెంట్. ఆ పరుగులో పడిపోయి నాలుగు గోడలే ప్రపంచంగా బతికేస్తారు. అసలుసిసలు ప్రపంచాన్ని దర్శించే అవకాశమే ఉండదు. అరవై తర్వాతబోలెడంత తీరిక ఉన్నా.. ఎక్కడికీ వెళ్లాలనిపించదు. ‘ఓపిక లేకపోవడం అనేది ఓ మానసిక జాడ్యం. మీరు ప్లాన్ చేసుకోండి. మేం తీసుకెళ్తాం’ అంటున్నారు కొందరు టూర్ ఆపరేటర్లు.సీనియర్ సిటిజన్లకు పెన్షన్లు వస్తుంటాయి. ఎంతోకొంత పొదుపు సొమ్మూ ఉంటుంది. లేనిదల్లా.. ఉత్సాహమే. ఆ ఒక్కటి అందించగలిగితే.. అరవైలలో ఇరవై వచ్చేస్తుంది. బాక్సర్ వేసుకుని, బ్యాక్ప్యాక్ తగిలించుకుని టూర్లకు సిద్ధం అవుతారు. ఢిల్లీకి చెందిన ‘సీనియర్ వరల్డ్’ అనే సంస్థ ఆ వయోధిక యాత్రికులకు టూర్ ఆపరేటర్‌గా వ్యవహరిస్తుంది. రంగురంగుల చేపలు, పగడాల దిబ్బలతో కనువిందు చేసే సముద్ర గర్భంలో ఈదులాడటం అంటే కలల ప్రపంచంలో అడుగుపెట్టడమే. కాకపోతే.. సాహస విన్యాసాలు చేయడం, పర్వతాలను అధిరోహించడం పెద్దలకు తలకుమించిన పనిలా అనిపిస్తుంది. అంతరిస్క్ ఎందుకని.. ఏ కాశీయాత్రకో పరిమితం అవుతారు. ఇప్పుడు అదంతా గతం. వృద్ధులను సుదూర పర్యటనలకు తీసుకెళ్లడానికి, వారికి సాహసకృత్యాలను పరిచయం చేయడానికి కొన్ని సంస్థలు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించాయి. వాటిలో ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌కు చెందిన‘సీనియర్ వరల్డ్’ ప్రముఖమైంది.

దీన్ని రాహుల్ గుప్తా, ఎంపీ దీపు అనే జంట ఆంత్రప్రెన్యూర్స్ ప్రారంభించారు.మొదట్లో సంస్థ సేవలు ఆన్‌లైన్‌లో వృద్ధులకు జీవనశైలి చిట్కాలు అందించడానికి, అవసరమైన వస్తువులు సరఫరా చేయడానికే పరిమితం. క్రమంగా యాత్రలకూ విస్తరించారు. తొలి ప్రయాణికులు ఢిల్లీ వాస్తవ్యులైన.. కెకె రిఖీ, ఆయన భార్య సుధ. ఇద్దరూ 70లలో ఉన్నవాళ్లే. రిఖీ ఆర్మీ ఉద్యోగి కావడంతో క్షణం కూడా తీరిక ఉండేది కాదు. దీంతో ఆ దంపతులు తరచూ తమ పర్యటనలను వాయిదా వేసుకునేవారు. ఆ వెలితిని తీర్చుకునేందుకు రిఖీ రిటైర్మెంట్ తర్వాత.. సీనియర్ వరల్డ్‌ను ఆశ్రయించారు. గడచిన రెండేండ్లలో మూడుసార్లు ప్రపంచాన్ని చుట్టొచ్చారు ఇద్దరూ. సీనియర్ వరల్డ్ ఇప్పటివరకు 200కు పైగా ట్రిప్పులు వేసింది. వీటిలో భూటాన్, ఇండోనేసియా, సింగపూర్, కెన్యా సహా పాతిక విదేశాలు ఉన్నాయి.సుదూర ప్రయాణాలు పెద్దలకు సవాలే.

ఓ వయసుకు వచ్చాక ఏదో ఒక ఆరోగ్య సమస్య వారిని ఇబ్బందిపెడుతూ ఉంటుంది. అందుకే, పర్యాటక బృందం బాగోగులు చూసుకోవడానికి ఓ నిపుణుడైన కేర్ మేనేజర్ ఉంటాడు. ‘ఎన్నో ఏండ్ల నుంచీ కలలుగా మిగిలిపోయిన యాత్రా స్వప్నాలను నిజం చేయడమే మా లక్ష్యం. ప్రయాణికుల భద్రత మా తొలి ప్రాధాన్యం’ అంటారు సీనియర్ వరల్డ్ సహ-వ్యవస్థాపకురాలు దీపు. ఇటీవలి పర్యటనలో ఒక యాత్రికుడికి కౌలాలంపూర్‌లో గుండెపోటు వచ్చింది. టూర్ మేనేజర్ అతని సంరక్షణ బాధ్యతలు తీసుకున్నాడు. ప్రాణాలనూ కాపాడాడు. ఇప్పటివరకు 5,000 మంది పెద్దలు ‘సీనియర్ వరల్డ్’ సేవలను వినియోగించుకున్నారు. చార్జీలు.. ఐదు రాత్రులకు ఒక్కరికి 50,000 రూపాయల నుంచి చార్జీలు మొదలవుతాయి.గురుగ్రామ్‌లో 2006లో ఓ టెలికాం కంపెనీలో పనిచేస్తున్నప్పుడు.. దీపు, గుప్తా తొలిసారి కలుసుకున్నారు. ఇద్దరివీ ఒకే రకం ఆలోచనలు. పెద్దలు తమ జీవితాన్ని తమకు నచ్చినట్టు, ఎవ్వరి మీదా ఆధారపడకుండా గడిపేట్టు ఓ ప్రాజెక్ట్ డిజైన్ చేయాలని భావించారు. తమ కార్పొరేట్ బాధ్యతలను సమన్వయం చేసుకుంటూనే పెద్దల కోసం పనిచేసే దిశగా అడుగులు వేశారు. సాధారణంగా వయసు మీద పడుతున్న కొద్దీ శారీరక, మానసిక సమస్యలు చుట్టుముడతాయి. ఇట్టే కుంగుబాటుకు లోనవుతారు. కాబట్టి, పెద్దలు వృద్ధాప్యాన్ని భారంగా భావించకుండా, దాన్నో సానుకూలమైన మార్పుగా భావించేలా.. తమ సేవలను అందుబాటులోకి తెచ్చారు. వారికి నమ్మకమైన సేవలను అందిస్తూ మన్ననలను చూరగొన్నారు. అలా సీనియర్ వరల్డ్‌ను ఫేస్‌బుక్‌లో అనుసరించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు దాదాపు మూడు లక్షలకు చేరుకుంది.దీపు, గుప్తా తమ సంస్థను ఎక్స్‌ప్రెస్, ఎంగేజ్, ఎక్స్‌ప్లోర్, ఎంజాయ్ అనే నాలుగు ‘ఈ’ల చుట్టూ నిర్మించుకున్నారు. అన్నట్టు వీరికి ‘సిల్వర్ వింగ్స్’ అనే యాప్ కూడా ఉంది. దీని ద్వారా వివిధ ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నారు. ఇందులో పజిల్స్, క్విజ్‌లు, ఫిట్‌నెస్ చిట్కాలు, ధ్యానం, ఆరోగ్యానికి సంబంధించిన వీడియోలు ఉంటాయి. అలా వృద్ధులుమానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేలా తమవంతు ప్రయత్నిస్తున్నారు. సామాజికంగా చురుగ్గా ఉండేందుకు సాయపడుతున్నారు. మలిసంధ్యలో ఉన్నవారికి.. ప్రపంచం ఎంతో అందమైందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ‘ఇలాంటి సంస్థలు అందుబాటులో ఉంటే మన సంశయాలన్నీ పక్కన పెట్టేసి ప్రతి క్షణాన్నీ పరిపూర్ణంగా ఆస్వాదించవచ్చు’ అంటారు గురుగ్రామ్‌కు చెందిన 70 ఏండ్ల పరమ్‌జీత్ ఖరల్. ప్రయాణాలు మనిషికి కొత్త గాలిని పరిచయం చేస్తాయి. కొత్త జ్ఞాపకాలను మూటగట్టి ఇస్తాయి. ఈ దశలో వయోధికులకు కావలసింది కూడా ఆ కొద్దిపాటి మార్పే.

# ఈ రహదారి ప్రపంచపు ఎనిమిదో వింత’



తెల్లటి కొండల నడుమ మలుపులు తిరుగుతూ పోతున్న 1300 కిలోమీటర్ల పొడవున్న కారకోరం రహదారి... కేవలం రవాణాకు మాత్రమే కాదు. సాహసాలు చేయాలనుకునే వారికి, ప్రకృతిలోకి పరుగులు తీయాలనుకునే వాళ్లకు స్వాగతం పలుకుతోంది.పర్వతాల మీదుగా వచ్చే చల్లటి గాలి కారు విండోలో నుంచి దూసుకొచ్చి మొహాన్ని తాకుతోంది.పర్వతాల సమూహం మధ్య నుంచి కారు వెళుతోంది. నడి వేసవిలోనూ భూమికి 7వేల మీటర్ల ఎత్తులో ఉన్న కొండ అంచుల మీద మంచు దట్టంగా అల్లుకుంది.హిమానీనదాల నుంచి వస్తున్న నీరు నదిలోని జలచరాలకు కొత్త శక్తిని అందిస్తోంది. పాకిస్తాన్‌లో అత్యంత ఎత్తైన హుంజా లోయకు షాంగ్రిలా అని బ్రిటిష్ నవలా రచయిత జేమ్స్ హిల్టన్ మంచి పేరే పెట్టారు.



నేను కారకోరం హైవే మీదుగా ప్రయాణిస్తున్నాను. ప్రపంచంలోని అద్భుతమైన రాతి ఫలకాల మధ్య నుంచి వెళుతుందీ రహదారి. దీన్ని ప్రపంచ ఎనిమిదో వింతగా భావిస్తుంటారు. ఈ రోడ్‌మీద ప్రయాణించాలనేది చాలా మంది కల.ఇది ఒకప్పుడు సిల్క్‌రోడ్డులో బాగం. ఈ మార్గానికి శతాబ్దాల క్రితమే పూర్వీకులు పునాదులు వేశారు.అయితే 1978 వరకూ అంతగా అస్థిత్వంలో లేదు. 1978లో 24వేల మంది పాకిస్తానీ, చైనా కార్మికులు 20 ఏళ్ల పాటు ఈ మార్గాన్ని నిర్మించారు. అప్పటి నుంచి వాహనాల రాకపోకల కోసం అధికారికంగా ప్రారంభించారు. దీంతో ఈ మారుమూల ప్రాంతంలో వాణిజ్యం, పర్యటకం, ప్రయాణాలు పెరిగాయి.1300 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారి పాకిస్తాన్ రాజధాని ఇస్లామబాద్ సమీపంలో ఉన్న చిన్న పట్టణం హసన్ అబ్దల్ నుంచి కుంజేరబ్ మీదుగా చైనాలోని షిన్జియాంగ్ ప్రాంతంలో ఉన్న కష్గర్ వరకూ వెళుతుంది. ఒక దేశం నుంచి మరో దేశంలోకి అది కూడా సముద్ర మట్టానికి 4700 మీటర్ల ఎత్తులో నిర్మించిన అతి పెద్ద రహదారి ఇది. ఈ మార్గంలో 194వ కిలోమీటర్ వద్ద హంజా లోయలోకి వెళ్లేందుకు ఈ హైవే దిగి పక్కనున్న మరో రోడ్డులోకి వెళ్లాలి. లోయ చుట్టూ ఉన్న కొండలనే కారకోరం పర్వత శ్రేణిగా పిలుస్తారు. వీటి వల్లనే ఈ రహదారికి ఆ పేరు వచ్చింది. హిమానీ నదాల నుంచి వచ్చే స్వచ్ఛమైనజలాలు, ఆ నీటిని నింపుకున్న సరస్సులు, చుట్టూ మంచు అల్లుకున్న శిఖరాల మధ్య ఉన్న ఈ ప్రాంతం అసాధారణ ప్రకృతి రమణీయతతో మన ప్రయాణాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. ప్రయాణం ముందుకు సాగే కొద్దీ లోయలోని ప్రజల జీవన విధానం, వారి సంప్రదాయాలు ఈ ప్రాంతాన్ని మరింత ప్రత్యేకంగా మారుస్తున్నాయి.

షిన్జియాంగ్- అఫ్గానిస్తాన్‌లోని వఖాన్ కారిడార్ మధ్య గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రాంతంలో పొదలా అల్లుకుపోయినట్లు కనిపించే హంజావ్యాలీ భౌగోళిక కారణాల వల్ల 20వ శతాబ్దం వరకూ ప్రపంచానికి దూరంగా ఉంది. మొదట్లో బురుషో, వాఖి తెగలకు ఆవాసంగా ఉన్న ఈ ప్రాంతానికే ప్రత్యేకమైన భాష, సంగీతం, సంస్కృతి, సంప్రదాయం ఉన్నాయి. అవి ఇక్కడే తప్ప పాకిస్తాన్ కానీ, ప్రపంచంలో మరే ప్రాంతంలోనూ కనిపించవు.కారకోరం హైవే ప్రారంభించిన తర్వాత ఈ ప్రాంతం మీద ప్రతికూల ప్రభావం మొదలై, ఇక్కడి పర్యావరణాన్ని ధ్వంసం చేసింది. అంతే కాకుండా ఇక్కడున్న తెగల్లో నుంచి అనేకమంది తమ సంప్రదాయ జీవితాన్ని వదిలేసి కొత్తరకమైన వాటిని అలవాటు చేసుకున్నారు. వసంత కాలానికి స్వాగతం పలుకుతూ స్థానికులు కొన్ని రోజుల పాటు చేసుకునే గియానీ పండగలో బాగంగా సంప్రదాయబద్ధమైన దుస్తులు ధరించడం తగ్గిపోయింది.

అయినప్పటికీ కొంతమంది మాత్రం హంజావ్యాలీ సంప్రదాయాన్ని కాపాడేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు.విజయనగర సామ్రాజ్యం: దక్షిణ భారతంలో చిట్టచివరి హిందూ సామ్రాజ్యం ఎలా పతనమైంది? తళ్లికోట యుద్ధంలో నలుగురు సుల్తానులు ఏకమై ఎలా ఓడించారు

నా ప్రయాణంలో మొదటి మజిలీ అల్టిట్ గ్రామం. ఈ ఊరిలో 11 వందల ఏళ్ల పైబడిన చరిత్ర ఉన్న కోట నాటి సంస్కృతిని చాటి చెబుతూ సగర్వంగా నిలబడి ఉంది. ఇక్కడున్న ఓ కెఫేలో సంగీత కళాకారుడు ముజిబ్ రుజిక్‌ను కలిశాను. కారకోరం పర్వత శ్రేణిలో 7788 మీటర్ల ఎత్తున్న రకపోషి, 7266 మీటర్ల ఎత్తున్న డిరన్.. మంచు కప్పుకున్న ఈ శిఖరాల మధ్య కెఫే ఉంది. కెఫేకు కొంచెం దూరంలో లెయిఫ్ లార్సన్ మ్యూజిక్ సెంటర్ ఉంది. హంజా వ్యాలీలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయ సంగీతాన్ని తర్వాతి తరానికి నేర్పిస్తోంది.మేము సంగీతం మీద ఆధారపడ్డాం, ఎందుకంటే జీవితంలోని ప్రతీ అంశంలోనూ సంగీతం ముడిపడి ఉంది. మీరు వ్యవసాయం చేస్తున్నా లేక గోధుమ పంట కోస్తున్నా మేము సంప్రదాయ పాటలు పాడుతూ ఆ పని చేస్తామని రుజిక్ చెప్పారు. అయితే ఈ తరం వాళ్లకు వాటి గురించి తెలియడం లేదని సంగీతం నేర్పించడంమొదలు పెట్టిన తర్వాత వాళ్లిప్పుడు తమ సంస్కృతి ఎంత ముఖ్యమో తెలుసుకుంటున్నారని ఆయన నాతో అన్నారు.

ఈ మ్యూజిక్ సెంటర్‌ను 2016లో ప్రారంభించారు. అయితే జియా అల్ కరీమ్ పిల్లలకు సంగీతం నేర్పడం మొదలు పెట్టాకనే ఇది పని చేయడం మొదలైందని రుజిక్ వివరించారు. జానపద సంగీతాన్ని హాబీగా ఎంజాయ్ చేస్తున్న అల్టిట్ గ్రామంలో ఇక్కడే పుట్టి పెరిగిన ఉల్ కరీమ్ సంగీతంలో డిగ్రీ సాధించడంతో పాటు అనేక రకాల సంగీత వాద్య పరికరాలను వాయించడంలో నైపుణ్యం సంపాదించారు.

ఇక్కడ ఈ ఘనత సాధించింది ఆయనొక్కరే. 2022లో ఓ మోటార్ సైకిల్ ప్రమాదంలో మరణించే వరకు వందమందికిపైగా విద్యార్థులకు ఆయన సంగీతం నేర్పించారు.విద్యార్థులు సంగీతం నేర్చుకునే గదిలోకి రుజిక్ నన్ను తీసుకెళ్లారు. అదొక ఇల్లులాగే ఉంది. ఆ గదిలో నాలుగు గోడలకు దుషెక్ అని పిలిచే దిండు గలీబులు, దిరోస్ అని పిలిచే దిండ్లు వారగా వేసి ఉన్నాయి. అక్కడ దాదాపు 12 మంది విద్యార్థులు ఉన్నారు. పాకిస్తాన్ జాతీయ అతివాద దేశమైనా హంజా లోయలో ఉదారవాదం, స్వేచ్ఛ ఎక్కువ. ఇస్లాం ఆధిపత్యం ఎక్కువగా ఉన్నా.. ఇస్లాంలోని ఆధునిక తరం సహనం, మహిళల హక్కుల్ని ప్రోత్సహిస్తోంది. ఆడపిల్లలు స్వేచ్ఛగా ఆడుకోవచ్చు, చదువుకోవచ్చు, మహిళలు చాలా మంది యూనివర్సిటీలకు వెళ్లి చదువుకుంటున్నారు. లింగ వివక్ష లేకుండా అన్ని రంగాల్లో అందరికీ అవకాశాలు కల్పించడం అభినందించాల్సిన అంశం. సంగీతం నేర్చుకునేందుకు గదిలో కూర్చున్న వారిలో రుబాబ్ అని పిలిచే వీణ లాంటి వాయిద్యాన్ని పట్టుకున్న బాలికలు కూడా ఉన్నారు.



ముగ్గురు విద్యార్థులు “హరీప్” మ్యూజిక్ గురించి వివరించే క్రమంలో( హంజా ట్యూన్స్‌ని పిలిచే స్థానిక సంప్రదాయ పదం). పొడవాటి, సన్నటి వీణ లాంటి పరికరాన్ని వాయిస్తున్నారు. దానికి సపోర్టివ్‌గా ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో గీతలతో ఉండి డడాంగ్ అని పిలిచే పెద్ద డ్రమ్ము కూడా ఉంది. హంజా లోయలో ఏళ్ల తరబడి వారసత్వంగా వస్తున్న ఆ జానపద ధ్వనులు గాలినంతా ఆవరించి నన్ను మైమరిపించాయి. మరో లోకానికి తీసుకెళ్లాయి. మాటల్లో వివరించలేని అనుభూతిని మిగిల్చాయి.పాత అల్టిట్‌లో రాళ్లు పరిచి ఉన్న బాట మీదుగా మళ్లీ కారకోరం హైవే మీదకు వచ్చాను. అక్కడ నుంచి స్థానికంగా గొజాల్ అని పిలిచే అప్పర్ హంజాలోకి అడుగు పెట్టాను.సెంట్రల్ హంజాలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలే పాటిస్తున్నప్పటికీ గొజాలీలు వాఖి భాష ఎక్కువగా మాట్లాడుతున్నారు. వీరు వందల ఏళ్ల క్రితం పక్కనే ఉన్న వఖాన్ కారిడార్ నుంచి ఇక్కడకు వలస వచ్చి ఉండవచ్చు. రహదారి ప్రారంభించకముందు హంజాలోని ఈ రెండు ప్రాంతాల్లో ఒక దాని నుంచి మరొక దానికి చేరుకోవడానికి రోజులు పట్టేది. అయితే ఇప్పుడు గంటలోపే చేరుకోవచ్చు. ఈ ప్రాంతంలోకి అడుగు పెట్టగానే దట్టమైన నీలి రంగులో ఉన్న అట్టాబాద్ సరస్సు నాకు స్వాగతం పలికింది.అట్టాబాద్ సరస్సు సహజంగా ఏర్పడింది కాదు. దాని వెనుక ఓ విషాదం ఉంది. ఈ సరస్సు ప్రకతి శోభతో కళకళలాడుతోంది. 2010 జనవరి 4న పెద్ద కొండ చరియ విరిగిపడటంతో కొన్ని రాళ్లు హంజా నది ప్రవాహానికి అడ్డుగా పడిపోయాయి. అది అట్టాబాద్ సరస్సుని సృష్టించింది. ఇప్పుడా సరస్సు చుట్టూ ఖరీదైన హోటళ్లు ఏర్పడ్డాయి. కొండచరియలతో ధ్వంసమైన గ్రామం పేరే సరస్సుకు పెట్టారు. ఇప్పుడా గ్రామం హంజా లోయ ఆధునికతకు, మార్పుకు పోస్టర్ బాయ్‌లా కనిపిస్తోంది. కారకోరం హైవే చైనా- పాకిస్తాన్ ఫ్రెండ్‌షిప్ టన్నెల్స్ పేరుతో ఐదు సొరంగ మార్గాలను 2015లో నిర్మించారు. అవి ఈ మారుమూల ప్రాంతంలో కాకుండా... ఏదో ఒక అత్యాధునిక నగరంలో నిర్మించిన వాటిలా ఉన్నాయి. రోడ్డు విడిచి కొన్ని కిలోమీటర్లు వెళ్లిన తర్వాత నాకు బాజ్‌లాంజ్ కెఫే కనిపించింది. స్థానిక మహిళలే ప్రారంభించి, నిర్వహిస్తూ, స్థానిక వంటకాలు వడ్డిస్తున్న ఇలాంటి రెస్టారెంట్ కోసమే నేను వెదుకుతున్నాను. పాకిస్తానీ వంటకాల్లో మసాలా ఘాటు ఎక్కువగా ఉంటుంది. అయితే హంజా వంటకాల్లో మాత్రం అది పుదీనా వాసనను దాటి బయటకు రాదు. పైగా చాలా రుచికరంగా ఉంటుంది. కొన్ని వంటల్లో ఆలివ్ నూనె జడల బర్రె మాంసం ఉంటాయి. నేను మూల్ ( పాలతో చేసిన చీజ్, చక్కెర, యాపిల్ వెనిగర్‌తో చేసిన వంటకం), గిల్మండి( పల్చటి రొట్టె ముక్కల మధ్య వెన్న, కొన్ని గింజలు పెట్టి చేసే శాండ్ విచ్ లాంటిది) కోసం ఆర్డర్ చేశాను. “సంప్రదాయ వంటలు దాదాపు అంతరించే దశలో ఉన్నాయి. ఎందుకంటే మా పిల్లలు ఈ వంటలను ఇష్టపడటం లేదు. వాటినెవరూ చెయ్యడం లేదు. దాంతో మేము వాటిని వండటం మొదలు పెట్టాము. మాతో మరి కొంతమంది మహిళలు కలిశారు. సంప్రదాయ వంటకాలను రుచి చూడటానికి స్థానికులు బాగానే వస్తున్నారు” అని సుల్తానా నాతో చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రాచీనమైన అడవి పువ్వు బాజ్‌లంజ్ పేరు మీద స్థాపించిన ఈ రెస్టారెంట్‌లో ఇదే పేరుతో తయారు చేసిన టీ కూడా తాగాను.గొజల్‌లో ప్రత్యేకించి గుల్మిట్‌లో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య ఎక్కువని నాకు అప్పుడే తెలిసింది. పాకిస్తాన్‌లో కార్మికశక్తిలో మహిళల వాటా 20 శాతం మాత్రమే. ఇది ప్రపంచంలనే అతి తక్కువ. అయితే హంజావ్యాలీలో మాత్రం మహిళలు రెస్టారెంట్లు, షాపులు నిర్వహించడమే కాకుండా కార్పెంటర్లుగా కూడా పని చేస్తున్నారు. సుల్తానా, బేగం రెస్టారెంట్‌కు కొంచెం దూరంలో చర్చ్ ముందు వైపున పైబాగంలో కనిపించే కోన్ లాంటి లాంటి నిర్మాణం మహిళా సాధికారతకు మరో ఉదాహరణ. 400 ఏళ్ల నాటి ఇంట్లో కోర్గాహ్ అనే కార్పెట్ ఫ్యాక్టరీని మహిళలే నడుపుతున్నారు.

నేను ఆ ఇంట్లోకి అడుగు పెట్టగానే ఐదుగురు మహిళలు విశాలమైన గదిలో కూర్చుని పని చేస్తున్నారు. వారి చుట్టూ అల్లిన రగ్గులు గోడకు వేలాడ దీసి ఉన్నాయి. వాళ్లు అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్న సమయంలో తీసిన ఫోటోలు కూడా గోడకు వేలాడుతున్నాయి.“మేము 1998లో మొదలు పెట్టాం, అప్పట్లో కారకోరం ప్రాంత అభివృద్ధి సంస్థ 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చిందని షమినా బానో నాతో చెప్పారు. ఈ గ్రామంలోనే పుట్టి పెరిగిన ఆమె కోర్గాహ్‌ను నడిపిస్తున్నారు. గుల్మిట్‌లో, మొత్తంగా చెప్పాలంటే ఈ ప్రాంతంలోనే రగ్గుల తయారీలో శిక్షణ తీసుకున్న తొలి మహిళ ఆమె. వందల మందితో కలిసి పని చేశారు. కారకోరం హైవే మీద ప్రస్తుతం ఈ రగ్గుల ఫ్యాక్టరీ సుప్రసిద్ధ పర్యటక ప్రాంతం. అంటే దీనర్థం అంతరించిపోతున్న రగ్గులు, కార్పెట్ల అల్లకాన్ని కాపాడటంతో పాటు ఈ మహిళలు తమ కుటుంబాల పోషణ బాధ్యతంతా తమ భుజాల మీద మోస్తున్నారు.సంప్రదాయ రగ్గులను వాఖి భాషలో షర్మా లేదా ప్లాస్ అని పిలుస్తారు. వీటిని జడల బర్రె లేదా మేక వెంట్రుకలతో తయారు చేస్తారు. ఇవి వందల ఏళ్లుగా మా సంస్కృతిలో భాగం. మేము శిక్షణ తీసుకోవడానికి ముందే ఉన్నాయని బానో చెప్పారు. పర్వత ప్రాంతాల్లో పెరిగే ఐబెక్స్ అనే మేకను పోలిన డిజైన్‌తో ఆమె ఓ రగ్గును తయారు చేస్తున్నారు.ఒక గంట తర్వాత సెంట్రల్ హంజాకు వెళ్లేందుకు బయల్దేరాను. పస్సు కోన్స్ ఇల్లు క్రమేపీ నా కంటి చూపు నుంచి దూరమైంది. వంపులు తిరిగిన రోడ్డు పొడవునా ఆవులు, మేకలు కనిపిస్తూనే ఉన్నాయి. కొంతమంది పెద్దవాళ్లు తమ వీపుపై ఉన్న చెక్క అరల్లో గడ్డి మోపుల్ని మోసుకెళుతున్నారు. ఆధునికత సృష్టిస్తున్న అలజడికి దూరంగా హంజా వ్యాలీ ప్రజల సంప్రదాయ జీవితంలో మరో కోణం ఇది.నిర్మాణపరంగా అద్భుతంగా ఉండే కారకోరం హైవే హంజా వ్యాలీ ప్రజలు లేకపోతే కళా విహీనంగా కనిపిస్తుంది. అత్యాధునికంగా నిర్మించిన ఆ సొరంగాలలో నుంచి తిరిగి వెళుతున్నప్పుడు రుజిక్ చెప్పిన ఓ మాట గుర్తుకొచ్చింది. మేము మా సంస్కృతిని 60 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల నుంచి రక్షించుకుంటూ వస్తున్నాం.... అదే ఆ మాట.అత్యాధునికంగా నిర్మించిన ఆ సొరంగాల గుండా తిరిగి వెళుతున్నప్పుడు అనేక మంది సంస్కృతి పరిరక్షకుల గురించి ఆలోచించాను. హంజా వ్యాలీలో వాళ్లను నేను కలుసుకున్నాను. సంగీత కళాకారుల నుంచి స్థానిక వంటవాళ్లు, కళాకారులు ఇలా ఎంతో మంది. భవిష్యత్‌లో ఇక్కడికొచ్చే పర్యటకులు కూడా ఈ కారకోరం హైవేను ప్రత్యేకంగా మారుస్తున్న వాళ్లను కలిసి, వారి అనుభవాలను పంచుకుంటారనే ఆశతో ఉన్నాను.ఈ విశాలమైన రహదారి ప్రపంచంలోని అనేక హైవేలలో ప్రముఖమైనది. వాహనాల్లో వెళ్లే వారికి సాహసాలు చేసే ప్రయాణికులకు మంచి జ్ఞాపకాల్ని అందిస్తుంది.

# సర్వైకల్ క్యాన్సర్ రాకుండా..



డాక్టర్ గారూ నమస్తే. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఏ వయసులో వేసుకోవాలి. ఇలాంటి క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్లు మార్కెట్‌లో ఇంకేమైనా ఉన్నాయా? ఎంత ఖర్చు అవుతుంది? ఎక్కడ లభిస్తాయి?

సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్లను తొమ్మిదేళ్ల నుంచి పదిహేనేళ్లలోపు ఆడపిల్లలైతే.. రెండు డోసులు వేయించాలి. తొలిడోసు తర్వాత ఆరునెలలకు మరో డోసు వేస్తారు. ఒక్కో డోస్ రెండు వేల దాకా అవుతుంది. పెద్దవాళ్లు కూడా వేయించుకునే వీలుంది. నిజానికి, సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను 45 ఏళ్ల వయసులోనూ తీసుకోవచ్చు. కాకపోతే, పెళ్లికి ముందు అయితే మంచిది. ఎందుకంటే, ఈ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్ల వస్తుంది. ఇది సంభోగం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. హెచ్‌పీవీలో చాలా రకాలు ఉంటాయి. అలా అని, అన్నిటి వల్లా క్యాన్సర్ రాదు. హైరిస్క్ హెచ్‌పీవీ వల్ల మాత్రమే క్యాన్సర్ వస్తుంది. శరీరంలో ఉండేది మామూలు వైరసా, హైరిస్క్ వైరసా అనేది బయటికి తెలియదు కాబట్టి, లైంగిక జీవితం ప్రారంభించకముందే ఈ వ్యాక్సిన్లు తీసుకుంటే మంచిది. ఇవి వేయించుకున్నా సరే.. పెళ్లయ్యాక లేదా సెక్స్ జీవితం ప్రారంభించిన మూడేళ్ల తర్వాత పాప్‌స్మియర్ తప్పకుండా చేయించుకోవాలి. పదిహేను దాటాక అయితే, మొదటి డోసు తర్వాత రెండు నెలలకు ఒకటి, ఆరునెలలకు మరొకటి చొప్పున మూడు డోసులు తీసుకోవాలి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా దాదాపు 80 శాతం వరకూ ఇవి నియంత్రించగలవు. మిగతా క్యాన్సర్లకు ఎలాంటి వ్యాక్సిన్లూ అందుబాటులో లేవు. ఏ వయసు వాళ్లయినా వేసుకోగలిగే మరో వ్యాక్సిన్ హెపటైటిస్-బి. ఇది లివర్ క్యాన్సర్ రాకుండా అరికడుతుంది. కామెర్లతో వచ్చే ఇన్‌ఫెక్షన్ కారణంగా ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. హెపటైటిస్-బి పరీక్ష నెగెటివ్ వస్తే ఈ డోస్ వేయించుకోవచ్చు.

# రైతుకు రొక్కం.. చేనుకు శోభ!



మా నాన్న భద్రయ్య హెడ్ మాస్టర్. సొంతూరు కరీంనగర్ జిల్లా చొప్పదండిలో మాకు యాభై ఎకరాల సేద్యం ఉంది. కూలీలు ఉన్నా కుటుంబ సభ్యులు కూడా కష్టపడక తప్పదు. చదువుకునే రోజుల్లో నేనూ పొలానికి వెళ్లేదాన్ని. అప్పట్లో ఇన్ని పనిముట్లు లేవు. ఇన్నిన్ని వంగడాలు లేవు. నేను హైదరాబాద్‌లోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ చదివాను. అప్పట్లో హైదరాబాద్‌లో మత ఘర్షణల వల్ల చాలా రోజులు కాలేజ్ మూసేశారు. క్లాసులు సక్రమంగా జరిగేవి కాదు. దీంతో ఎంసెట్ సరిగా రాయలేకపోయాను. చదివితే వ్యవసాయ శాస్త్రమే చదవాలనే పట్టు దలతో డిగ్రీలో చేరలేదు. ఎంసెట్ రెండో ప్రయత్నంలో మంచి ర్యాంక్ వచ్చింది. బీఎస్సీ (అగ్రికల్చర్)లో చేరాను. రెండో సంవత్సంలో ప్లాంట్ బ్రీడింగ్ పరిచయమైంది. కొత్త వంగడాల గురించి ఇందులో ఉంటుంది. పీజీలో ప్లాంట్ బ్రీడింగ్ చదవాలంటే ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ రావాలి. అందుకే పట్టుదలగా చదివాను. ఫస్ట్ ర్యాంక్ సాధించాను. ఎమ్మెస్సీలో ప్లాంట్ బ్రీడింగ్ స్పెషలైజేషన్ చేశాను. సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ రీసెర్చ్ ఫెలోషిప్ వచ్చింది. ధార్వాడ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో చేరాను. పొద్దుతిరుగుడు పంటలో పేరెంటల్ లైన్స్ (ఆడ, మగ) సాగు మీద పరిశోధన చేశాను. మూడేళ్లలోనే పీహెచ్‌డీ పట్టా సాధించాను.

## వరంగల్ కంది

పీహెచ్‌డీ పూర్తికాగానే మండల వ్యవసాయ అధికారిగా ఉద్యోగం వచ్చింది. మూడేళ్ల తర్వాత ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సైంటిస్ట్ కొలువు వరించింది. నన్ను ప్రత్యేక బాధ్యతలతో వరంగల్‌లోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు పంపారు. అప్పట్లో ఇంత నీటి లభ్యత లేదు. ఆరుతడి పంటలే ఎక్కువ. కంది చేలు వైరస్‌ను తట్టుకోలేకపోయేవి. తక్కువ దిగుబడి పంటలనే రైతులు సాగు చేసేవారు. అధిక రాబడినిచ్చే, వైరస్ తెగుళ్లను తట్టుకునే కొత్తరకం వంగడాలపై అక్కడ పరిశోధన జరిగేది. నేనూ భాగస్వామిని అయ్యాను. డబ్ల్యూఆర్‌జీఈ93, డబ్ల్యూఆర్‌జీఈ97, డబ్ల్యూఆర్‌జీ255 వంగడాలను అభివృద్ధి చేశాం. తెలంగాణ రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నది ఈ కంది వంగడాలనే. ఆపైన కరీంనగర్‌లోని మొక్కజొన్న పరిశోధనా స్థానానికి బదిలీ అయ్యాను. ఇక్కడ ఎండు తెగులును తట్టుకునే హైబ్రిడ్ మొక్కజొన్న కేఎన్ఎంహెచ్4010131, యాసంగిలో తక్కువ కాలంలో దిగుబడి నిచ్చే కేఎన్ఎంహెచ్ 4010141 పేరెంటల్ లైన్స్‌ని అభివృద్ధి చేశాం.

## నెంబర్ వన్ సీడ్

పొలాసలోని రీజినల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో అసోసియేట్ బ్రీడర్‌గా వరి వంగడాలపై పరిశోధన చేశాను. ఉల్లికోడు పురుగు వల్ల ఎక్కువగా నష్టపోతున్నామని రైతులు చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారంగా తక్కువ వ్యయంతో, అధిక లాభాలిచ్చేలా కొత్త వంగడాల రూపకల్పనకు పూనుకున్నది మా బృందం. రెండేళ్లు కష్టపడి 'ప్రద్యుమ్న' రకం తయారు చేశాం. ఇది తక్కువ కాల పరిమితిలో మంచి దిగుబడిని ఇస్తుంది. వానకాలం, యాసంగి పంటగా వేసుకోవచ్చు. ఉల్లికోడును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే 'బతుకమ్మ' రకం వరి వంగడాన్నీ మేమే అభివృద్ధి చేశాం. సన్న వడ్లలో 'జేజీఎల్ 24423' రకం వంగడాన్ని అభివృద్ధి చేశాం. ఈ రకం వరిని సాగుచేస్తే మొక్క పడిపోదు. గింజ రాలిపోదు. సన్న వడ్లలో అధిక దిగుబడినిచ్చే 'కేఎన్ఎం1638' వంగడాన్నీ అభివృద్ధి చేశాం. మన రైతుల ప్రాధాన్యం ఈ వరి వంగడాలే. తెలంగాణలో సాగు అవుతున్న వరిలో కేఎన్ఎం1638, జేజేఎల్24423లే ఎక్కువ.

## బ్రీడ్ లీడర్

అయిదేళ్ల క్రితం.. నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌కు సీనియర్ సైంటిస్ట్‌గా బదిలీ అయ్యాను. ఇక్కడ ఆగ్రో ఫారెస్ట్రీలో రీసెర్చ్ చేస్తున్నాను. ట్కట్కపై ఉడ్ పరిశ్రమ దేశంలో శరవేగంగా ఎదుగుతున్నది. ఆ కంపెనీలకు కావాల్సిన చెక్క మన దగ్గర అందుబాటులో లేదు. మన వేప ఉద్యాన సాగుకు అనువైంది కాదు. కొమ్మలు ఎక్కువగా ఉండటం వల్ల దిగుబడి తగ్గుతుంది. కొమ్మలు కత్తిరించడం రైతుకు సమస్యే. వీటిని అధిగమించేందుకు మలబార్ వేపతో ఎన్‌టీపీఎంబీ01 అనే మ్యూటెంట్ (ఉత్పరివర్తనం చెందించిన) వేపను అభివృద్ధి చేశాను. ఈ వేపచెట్టు నిలువుగా పెరుగుతుంది.

కొమ్మలు వాటంతట అవే రాలిపోతాయి. తెలంగాణలో ఉద్యాన పంటలు పెరుగుతున్నాయి. టమాట, వంగ లాంటి మొక్కల పెంపకానికి ఊతంగా నిలువు కర్రల సాయం అవసరం అవుతుంది. ఇప్పటి వరకు మన రైతులకు ఈ సమస్యపై అవగాహన లేదు. భవిష్యత్ అవసరాల కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన పద్దెనిమిది వెదురు జాతులను నర్సాపూర్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో పెంచుతున్నాం. ఉద్యాన పంటల సాగులో వీటి ఉపయోగాన్ని అధ్యయనం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాల కోసం టిష్యూ కల్చర్ ద్వారా కొత్తరకం వెదురు మొక్కను అభివృద్ధి చేసే పనిలో ఉన్నాను. తెలంగాణ రైతులకు ఇది మా కానుక.

# తమిళనాట.. తెలుగు రుచుల ఊట



పక్కపక్కనే ఉన్నా రెండు బావుల్లోని నీళ్ల రుచులు వేరువేరుగా ఉంటాయి. ఇరుగుపొరుగే అయినా తమిళ వంటలకు, తెలుగు విందులకు ఎంతో తేడా. ద్రవిడ దేశపు సాంబారు ఇడ్లీ ఎంత నచ్చినా, రోజూ తింటే బోరే. మామిడికాయ తొక్కు మీదా, కారం పొడులూ, కజ్జికాయల మీదా ప్రాణం లాగుతూనే ఉంటుంది. చెన్నైలో స్థిరపడిన తెలుగువాళ్లకు ఆ లోటు ఏమాత్రం తెలియకుండా చేస్తున్నారు 'ఆంధ్రా డెలికసీ' యజమాని సౌజన్య ధనాల. తమ తెలుగు రుచుల విశేషాల్ని 'జిందగీ'తో పంచుకున్నారిలా%ా

తరాల క్రితమే చెన్నైలో స్థిరపడిన తెలుగువాళ్లం మేం. మా వారిది కర్నూలు జిల్లా బనగానపల్లె. ఆయన ఇక్కడే ఐటీలో ఉద్యోగం చేస్తారు. నిల్వ పచ్చళ్లు పెట్టడంలో, పొడులు చేయడంలో చేయితిరిగిన మనిషి మా అత్తగారు. మా కోసం రకరకాల పదార్థాలు చేసి పంపేవారు. వాటిని మేం తినడమే కాదు, చుట్టుపక్కల వాళ్లకూ పంచేవాళ్లం. వాళ్లంతా ఆ రుచిని ఎంతగానో మెచ్చుకునేవారు. నేను న్యూజిలాండ్‌లో ఎంబీఏ చేశాను. గతంలో ఓ ఐటీ కంపెనీ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేదాన్ని. పని ఒత్తిళ్లు, వృత్తి పట్ల అసంతృప్తి కారణంగా.. రెండేళ్లకన్నా ఎక్కువ

వెళ్లేవాళ్లం. సింగపూర్ వరకూ తీసుకెళ్లాం. ఇంకా కావాలంటే ఆన్‌లైన్ ఆర్డర్ పెట్టుకోవచ్చని చెప్పేవాళ్లం. అయితే, దీనివల్ల పదార్థాలు బాగా వృథా అయ్యేవి. ఒకసారి పాతిక కేజీల దాకా పచ్చడి మిగిలిపోయింది. అనాథా శ్రమంలో ఇచ్చాం. తర్వాత నుంచి ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లాంటి వేదికల ద్వారా ప్రకటనలు చేశాం. ఆ ప్రచారం విజయవంతమైంది. మా సంస్థ ద్వారా ఆవకాయ, గోంగూర, ఉసిరికాయ పచ్చళ్లతో పాటు.. పప్పుల పొడి, నల్లకారం, గవ్వలు, పూత రేకులు, హల్వా లాంటివి అమ్ముతున్నాం. వెబ్‌సైట్‌లో వీటి వివరాలు ఉన్నాయి. అవి కాకుండా వంకాయ, చిక్కుడుకాయ, క్యాలీ ఫ్లవర్





కాలం కొనసాగలేక పోయాను. ఉద్యోగానికి స్వస్తి పలికాను. తొలినుంచీ నాకు సొంతంగా వ్యాపారం చేయాలని ఉండేది. దాంతో మా అత్తగారు పంపే పచ్చళ్లు, పొడులు, పిండివంటలను ఓ బ్రాండ్ కింద అమ్మితే ఎలా ఉంటుంది? అనిపించింది. ఆయనకూ ఐడియా నచ్చడంతో అత్తగారితో మాట్లాడాం. ఆవిడ కూడా ఉత్సాహం చూపారు. అలా, 2017లో 'ఆంధ్రా డెలికసీ' ప్రారంభించాం.

## మంచి ఆదరణ

నలుగురికీ తెలిసేలా ఒక బ్రాండ్ సృష్టించడంలోనే ఏ వ్యాపార విజయమైనా దాగి ఉంటుంది. అందుకే తొలి రోజుల్లో ఎక్కడ ఎగ్జిబిషన్ జరిగినా మా ఉత్పత్తులతో

తదితర కూరగాయలతోనూ నిల్వ పచ్చళ్లు పెడతాం. నెలకు కనీసం పాతిక కిలోల పచ్చళ్లు విక్రయిస్తాం. అన్నీ కలిపి లక్షా లక్షన్నర దాకా అమ్మకాలు జరుగుతాయి. కృష్ణాష్టమి, దసరా, దీపావళిలాంటి పండుగలప్పుడు విభిన్న రకాల స్వీట్ల కలగలుపుగా మేం అందించే స్పెషల్ ప్యాక్‌లు చాలా మందికి నచ్చు తున్నాయి. అమెరికా, దుబాయ్, సౌతాఫ్రికాలాంటి చాలా దేశాలకూ పార్సిల్స్ పంపుతున్నాం. ప్రస్తుతం ఉన్న మా స్టోర్‌ను మరింత పెద్దది చేసి సాయంత్రాలు పునుగులు, మిర్చీబజ్జి, ఉగ్గాణి లాంటివి అమ్మాలనుకుంటున్నాం. చెన్నపట్నం ప్రజలకు మరిన్ని తెలుగు రుచులను అందించడమే లక్ష్యంగా ముందుకెళు తున్నాం. 'మీ మిఠాయిలు రుచి చేసిన ప్రతిసారీ సొంతూరికి వెళ్లిన భావన కలుగుతుంది' అంటుంటారు చాలామంది.

# గోరింటాకు చేతులు కాళ్లకే కాదు.. ఇప్పుడు వీపు దాకా పాకేసింది!



గోరింటాకు అరచేతిలో పండితే అందం. కాళ్లను చుడితే ముస్తాబు. అదే రవికగా మారిపోతే.. వీపునూ చేతులనూ అలంకరిస్తే.. కొత్త ట్రెండ్! అవును.. ఇప్పుడు బ్లౌజ్ మెహందీ సరికొత్త ట్రెండ్. అతిసాదా అలంకరణ నుంచి నిండైన నగల డిజైన్ల దాకా ఎన్నో రకాలు.. మెహందీ రవికల్లో కనువిందు చేస్తున్నాయి.మెహందీ ఫంక్షన్ ఎంత ఘనంగా చేసుకున్నా, గోరింటాకులో ఎన్ని కొత్త డిజైన్లు ప్రయత్నించినా.. అలంకరించేది కాళ్లకూ, చేతులకేగా! ఎక్కడ చూసినా, ఎన్నేళ్లు గడిచినా ఇంతేనా.. అనుకునే ఆధునిక పెళ్లి కూతుళ్ల కోసం మెహందీ డిజైనర్లు సరికొత్త కాన్సెప్ట్‌తో ముందుకొచ్చారు. చూడగానే వావ్ అనిపించేలా, కళ్లతో చూస్తే కాదనలేని విధంగా కొంగొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. బ్లౌజ్ మెహందీ డిజైన్లు నేటి తరం పెళ్లి కూతుళ్ల బ్యాక్‌లెస్ జాకెట్లకు కొత్త అలంకారం.

**ఎన్నో ఎన్నెన్నో..** మెహందీలో ఉన్నట్టుగానే ఇందులోనూ ఎన్నో రకాల డిజైన్లు అందాలొలికిస్తున్నాయి. విభిన్న మోటిఫ్ ప్రింట్లతో అచ్చం నిజం బ్లౌజ్‌లా కనిపించేలా, వెనక బటన్లు, అంచువెంట వేసే పూసలు, లేసులను కూడా అచ్చు గుద్దినట్టు ఇందులో చూపిస్తున్నారు కళాకారులు. వీపు మీద టాజిల్స్ వేలాడినట్టు, చిన్ని గంటలు వరుస కట్టినట్టూ కనికట్టు చేస్తున్నారు. ఆడపిల్లలకు వర్క్ బ్లౌజుల మీద ఉండే ఇష్టాన్ని గమనించి గ్రాండ్‌గా ఎంబ్రాయిడరీ వర్క్ చేసినట్టు అనిపించే డిజైన్లనూ ఆవిష్కరిస్తున్నారు. పూలు, లతలు, మామిడి పిందెలు, ఏనుగులలాంటి మోటిఫ్‌లను ఇందుకోసం వాడుతున్నారు. వీపు మీద, చేతుల మీద నాజూగ్గా వచ్చే జాలీ వర్క్ ముద్దు గుమ్మలను మరింత ముగ్ధ మనోహరంగా చూపిస్తుంది.

మరింత సునిశితంగా ఉండే నగల డిజైన్లను చేయి తిరిగిన కళాకారులు ఈ బ్లౌజ్ మెహందీలో మెరిపిస్తున్నారు. చీరతో పాటు ఫ్యాషనబుల్ డ్రెస్సుల మీదకీ నప్పేలా మాడ్రన్ జువెలరీ డిజైన్లతోనూ మెహందీని పెడుతున్నారు. బ్యాక్ ఓపెన్ బ్లౌజ్‌ల కోసం పల్లకీ తరహా డిజైన్లు అదుర్స్ అనిపిస్తున్నాయి. చేతులకు ఒకరకంగా, బాడీకి మరోరకంగా వచ్చే డిజైన్లు ఎక్కువ మందికి ఫేవరెట్‌గా ఉంటున్నాయి. బ్యాక్‌లెస్ కాకుండా స్లీవ్‌లెస్ మాత్రమే వేసుకునే వాళ్లకోసం అరచేతిలో మొగ్గ తొడిగిన గోరింటకు మ్యాచింగ్‌గా చేతులకూ డిజైన్‌ను వేస్తున్నారు. ఇవైతే పెళ్లికూతుళ్లకే కాదు, విడిగా ఈవెంట్లకు వేసుకునేందుకూ నప్పుతాయి. ఇక నుంచీ అరచేత మాత్రమే కాదు అందాల వీపుమీదా గోరింట మొగ్గ తొడుగుతుందన్న మాట!

## ఎడిటోరియల్

# విద్య, వైద్యం జాతీయీకరణ

విద్య-, వైద్య రంగాలలో నెలకొన్న అసమానతలు తొలగించకుండా సామాజిక,-ఆర్థిక-, రాజకీయ -సాంస్కృతిక రంగాలలో సమానత్వం సాధించడం అసాధ్యం. ప్రజల మధ్య సోదర భావం, జాతీయ ఐక్యత, సమైక్యత సాధించాలంటే విద్య,-వైద్య రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా తగు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ విద్య, -వైద్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు తగిన కృషి జరపాలి. అంతర్గత వలసాధిపత్యాన్ని, వనరుల దోపిడీ, తరలింపును నిరసిస్తూ తెలంగాణ ప్రజలు ప్రజాస్వామిక పద్ధతుల్లో సుదీర్ఘకాలం పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. విద్య, -వైద్యరంగాలలో ప్రైవేట్, కార్పొరేట్ విధానాన్ని సంపూర్ణంగా నిషేధిస్తూ సమగ్ర చట్టం తేవాలి. విద్య-, వైద్యం పేరిట జరిగే దోపిడీని అరికట్టాలి. ప్రజలందరికీ ఒకే రకంగా ఉపయోగపడేలా కమ్యూనిటి (ప్రజా) విద్యాలయాలు,- వైద్యశాలలు స్థాపించి అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించి ప్రజలకు అందుబాటులో వుంచాలి.

ప్రభుత్వ ఉద్యోగాలకు, పదవులకు ప్రభుత్వ విద్యా సంస్థలల్లో చదివిన వారే అర్హులు అనే నిబంధనను విధిగా తీసుకు రావాలి. ప్రభుత్వ ఉద్యోగులు, -ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివించాలనే విధి విధానాలను రూపొందించాలి. పాలకులకు ఒక న్యాయం, ప్రజలకు వేరొక న్యాయం ప్రజాస్వామ్యం అనిపించుకోదు.పాలకులు, -ప్రజలు అందరూ ఒకే రకమైన విద్య, -వైద్య సదుపాయాలు పొందాలి. అందుకోసం విద్య-, వైద్య రంగాలలో సమూల మార్పులు తేవాల్సివుంది. ఈ సామాజిక లక్ష్యం నెరవేరాలంటే యుద్ధప్రాతిపదికన విద్య, -వైద్య రంగాలను జాతీయీకరణ చేయడమే ఏకైక పరిష్కార మార్గం. రాజకీయ పార్టీలు విద్య-, వైద్యంపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి. విద్య-, వైద్యం జాతీయీకరణ జరిగేంత వరకు ఆయా పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యమ, ఉద్యోగ, హక్కుల సంఘాలు ప్రజలపక్షం వహిస్తూ ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలి. విద్య, వైద్యం సమాజపరమైన ఉమ్మడి అంశంగా పరిగణిస్తూ పాలకుల విధానంలో మార్పురావాలి. పాలకులు తమకు తాముగా ప్రభువులుగానో, గొప్పవాళ్ళుగానో ఊహించుకుంటూ ప్రజలకన్నా భిన్నమైన వసతులను, సౌకర్యాలను, రక్షణలను పొందుతున్నారు. నిజానికి ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలకు సేవకులుగా, ప్రజాధనానికి రక్షకులుగా ఉండాలి.

# వీసాలపై వెయ్యికళ్ల నిఘా



%అమెరికాలోని భారతీయ విద్యార్థుల కదలికలపై నిఘా పెంచిన సంగతి తెలిసిందే. భారత దేశంనుంచి విద్యార్థులు నిజంగా చదువులకోసం వచ్చారా లేదా చట్ట వ్యతిరేకంగా ఏవైనా ఉద్యోగాలు చేస్తున్నారా? సరైన అధికారిక పత్రాలతో వచ్చారా? వాళ్ల బ్యాంకు లావాదేవీలు ఎలా ఉన్నాయి? తదితర అంశాలపై తీవ్రంగా నిఘా కొనసాగుతోంది. అదేవిధంగా ఇప్పుడు తాజాగా హెచ్1బి, ఎఫ్1 వీసాదారుల అనధికారిక సంపాదనపైనా నిఘా పెడుతున్నారు. ఈ మేరకు పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని ఇమిగ్రేషన్ అధికారులకు ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అందించడం మొదలైంది.పన్నులు చెల్లించిన, దాఖలు చేసిన ఆదాయం కంటే అనధికారిక సంపాదనపైనే పరిశీలించడం ప్రారంభమైంది. దీంతో సైడ్ ఇన్కమ్పై ఆధారపడే అనేక మంది వలసదారులను అమెరికా నుంచి పంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలో ఇప్పుడు వలసదారులకు సైడ్ ఇన్కమ్ను నేరంగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది. రాయబార కార్యాలయాలు, పోర్టుల వద్ద ప్రవేశ సమయంలో హెచ్1బి వీసాదారులను ఈ విషయాలపై ప్రత్యేకంగా ప్రశ్నిస్తున్నారు. గతంలో విద్యార్థులుగా ఉన్నప్పుడు అనధికారికంగా ఎలాంటి వ్యవహారాలు సాగించారో ఆరా తీస్తున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా వెట్టింగ్ ద్వారా వీసాదారుల ప్రవర్తనను పరిశీలిస్తున్నారు. కొన్ని నెలల క్రితం అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు తమ యూనివర్శిటీల క్యాంపస్ల బయట పార్ట్టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారన్న అనుమానం ఎక్కువైంది.అమెరికా యూనివర్శిటీల్లో లక్షమందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరిపై నిఘా కొనసాగుతోంది. అమెరికాలో ఎంఎస్ చేసిన తరువాత తాత్కాలిక ఉద్యోగాలు చేసుకోవడానికి (ఇవి కూడా స్కిల్డ్ మాత్రమే) ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఒపిటి) ఇస్తారు. 202324 గణాంకాల ప్రకారం భారతీయ విద్యార్థులు 97,556 మంది ఒపిటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒపిటి చేసిన తరువాత ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా మరికొంత కాలం అమెరికాలో ఉండవచ్చు. అయితే ఇప్పుడు అలాంటి అవకాశం కనిపించడం లేదు. ఎంఎస్ పూర్తయిన వెంటనే ఉద్యోగం వస్తే సరేసరి. లేకుంటే మూటాముల్లె సర్దుకుని వెంటనే స్వదేశానికి బయలుదేరక తప్పదు. అమెరికా వెళ్లడంకోసం ఒక్కో విద్యార్థి సగటున రూ. 35 లక్షల నుంచి రూ. 49 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వీరు అమెరికాలో పార్ట్టైమ్ ఉద్యోగాలు చేసి అప్పులు తీర్చగలుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒపిటి ఎత్తివేస్తే తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు చదువుకోసం కాకుండా వేరే ఉద్యోగాల కోసమో, ఉపాధి కోసమో వచ్చినట్టు తేలితే చిక్కులు తప్పవు. ఇదంతా అమెరికాలోని ఉద్యోగాలు అమెరికా వాళ్లకే (మేడ్ ఎగైన్ గ్రేట్ అమెరికా మాగా) అన్న నినాదం ఊపందుకుంటోంది.

అమెరికాలో మొత్తం జనాభాలో 1.5 శాతం వరకు ప్రవాస భారతీయుల ఉనికి కనిపిస్తోంది. అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న వివాదం ఎక్కువవుతోంది. ఇదే వీసాదారుల పాలిట శాపంగా తయారవుతోంది. హెచ్1బి వీసాల్లో 70 శాతం భారతీయులే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులన్న ద్వేషం జడలు విప్పుతోంది. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకుని పనిచేయించుకోవడంతో ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించవలసి వస్తోందని ట్రంప్ ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. ఏటా దాదాపు 10,000 మంది హెచ్1బి వీసాదారులతోపాటు 60,000 నుంచి 70,000 మంది విద్యార్థులు అమెరికాకు వస్తుంటారు. వీరిలో 80% కంటే ఎక్కువ మంది యువతరం ఐటి, ఫైనాన్స్లో పనిచేస్తున్నవారే ఉంటున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆశయానికి ఈ హెచ్1బి ప్రక్రియ దెబ్బతీస్తుందని ట్రంప్ అభిప్రాయం. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. వీసా తిరస్కరణలు తృధికంగా పెరిగాయి.

మన దేశంనుంచి అమెరికాకు వెళ్లడానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హెచ్1బి వర్క్ పర్మిట్, ఎఫ్1 స్టూడెంట్ వీసా, హెచ్4 డిపెండెంట్ వీసా, హెచ్3 వీసా, 01 వీసా, పి వీసా, ఆర్1 రెలీజియన్ వీసా ఈ విధంగా నాన్ ఇమిగ్రెంట్ వీసాల ద్వారా అమెరికాకు వెళు ్తండటం పరిపాటిగా వస్తోంది. అయితే ఇప్పుడు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇకపై మరో దేశంలో ఇంటర్వ్యూకు హాజరయ్యే అవకాశం లేదని తాజా నిబంధనలు చెబుతున్నాయి. వీరు తమ స్వదేశంలోనే అమెరికా ఎంబసి, కాన్సులేట్లో మాత్రమే ఇంటర్వ్యూ అపాయింట్మెంట్ కోసం షెడ్యూల్ చేసుకోవాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కొవిడ్ సమయంలో భారత్లో వీసా అపాయింట్మెంట్ కోసం దాదాపు మూడేళ్ల కాలం ఎదురు చూడవలసి వచ్చేది. దీంతో చాలా మంది భారతీయులు థాయ్లాండ్, సింగపూర్, జర్మనీ, బ్రెజిల్ వంటి దేశాలకు వెళ్లి త్వరగా వీసాలు పొందేవారు. ఇప్పటికే భారత్లో బీ1, బీ2 వీసాల ఇంటర్వ్యూలకు సుమారు మూడున్నర నెలల సమయం పడుతోంది. కొత్త నిబంధనల వల్ల ఎన్ని నెలలు పడుతుందో చెప్పలేం. ఇలాంటి కఠినతర ఆంక్షల కారణంగానే హెచ్1బి వీసాదారులు ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి ఇతర దేశాలపై మొగ్గు చూపడం ప్రారంభమైంది.


# వీసాలపై వెయ్యికళ్ల నిఘా





%అమెరికాలోని భారతీయ విద్యార్థుల కదలికలపై నిఘా పెంచిన సంగతి తెలిసిందే. భారత దేశంనుంచి విద్యార్థులు నిజంగా చదువులకోసం వచ్చారా లేదా చట్ట వ్యతిరేకంగా ఏవైనా ఉద్యోగాలు చేస్తున్నారా? సరైన అధికారిక పత్రాలతో వచ్చారా? వాళ్ల బ్యాంకు లావాదేవీలు ఎలా ఉన్నాయి? తదితర అంశాలపై తీవ్రంగా నిఘా కొనసాగుతోంది. అదేవిధంగా ఇప్పుడు తాజాగా హెచ్1బి, ఎఫ్1 వీసాదారుల అనధికారిక సంపాదనపైనా నిఘా పెడుతున్నారు. ఈ మేరకు పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని ఇమిగ్రేషన్ అధికారులకు ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అందించడం మొదలైంది.

పన్నులు చెల్లించిన, దాఖలు చేసిన ఆదాయం కంటే అనధికారిక సంపాదనపైనే పరిశీలించడం ప్రారంభమైంది. దీంతో సైడ్ ఇన్కమ్పై ఆధారపడే అనేక మంది వలసదారులను అమెరికా నుంచి పంపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలో ఇప్పుడు వలసదారులకు సైడ్ ఇన్కమ్ను నేరంగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది. రాయబార కార్యాలయాలు, పోర్టుల వద్ద ప్రవేశ సమయంలో హెచ్1బి వీసాదారులను ఈ విషయాలపై ప్రత్యేకంగా ప్రశ్నిస్తున్నారు. గతంలో విద్యార్థులుగా ఉన్నప్పుడు అనధికారికంగా ఎలాంటి వ్యవహారాలు సాగించారో ఆరా తీస్తున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా వెట్టింగ్ ద్వారా వీసాదారుల ప్రవర్తనను పరిశీలిస్తున్నారు. కొన్ని నెలల క్రితం అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు తమ యూనివర్శిటీల క్యాంపస్ల బయట పార్ట్టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారన్న అనుమానం ఎక్కువైంది.అమెరికా యూనివర్శిటీల్లో లక్షమందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరిపై నిఘా కొనసాగుతోంది. అమెరికాలో ఎంఎస్ చేసిన తరువాత తాత్కాలిక ఉద్యోగాలు చేసుకోవడానికి (ఇవి కూడా స్కిల్డ్ మాత్రమే) ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఒపిటి) ఇస్తారు. 202324 గణాంకాల ప్రకారం భారతీయ విద్యార్థులు 97,556 మంది ఒపిటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఒపిటి చేసిన తరువాత ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా మరికొంత కాలం అమెరికాలో ఉండవచ్చు. అయితే ఇప్పుడు అలాంటి అవకాశం కనిపించడం లేదు. ఎంఎస్ పూర్తయిన వెంటనే ఉద్యోగం వస్తే సరేసరి. లేకుంటే మూటాముల్లె సర్దుకుని వెంటనే స్వదేశానికి బయలుదేరక తప్పదు. అమెరికా వెళ్లడంకోసం ఒక్కో విద్యార్థి సగటున రూ. 35 లక్షల నుంచి రూ. 49 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వీరు అమెరికాలో పార్ట్టైమ్ ఉద్యోగాలు చేసి అప్పులు తీర్చగలుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒపిటి ఎత్తివేస్తే తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు చదువుకోసం కాకుండా వేరే ఉద్యోగాల కోసమో, ఉపాధి కోసమో వచ్చినట్టు తేలితే చిక్కులు తప్పవు. ఇదంతా అమెరికాలోని ఉద్యోగాలు అమెరికా వాళ్లకే (మేడ్ ఎగైన్ గ్రేట్ అమెరికా మాగా) అన్న నినాదం ఊపందుకుంటోంది.అమెరికాలో మొత్తం జనాభాలో 1.5 శాతం వరకు ప్రవాస భారతీయుల ఉనికి కనిపిస్తోంది. అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న వివాదం ఎక్కువవుతోంది. ఇదే వీసాదారుల పాలిట శాపంగా తయారవుతోంది. హెచ్1బి వీసాల్లో 70 శాతం భారతీయులే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులన్న ద్వేషం జడలు విప్పుతోంది. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకుని పనిచేయించుకోవడంతో ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించవలసి వస్తోందని ట్రంప్ ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. ఏటా దాదాపు 10,000 మంది హెచ్1బి వీసాదారులతోపాటు 60,000 నుంచి 70,000 మంది విద్యార్థులు అమెరికాకు వస్తుంటారు. వీరిలో 80% కంటే ఎక్కువ మంది యువతరం ఐటి, ఫైనాన్స్లో పనిచేస్తున్నవారే ఉంటున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆశయానికి ఈ హెచ్1బి ప్రక్రియ దెబ్బతీస్తుందని ట్రంప్ అభిప్రాయం. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. వీసా తిరస్కరణలు అత్యధికంగా పెరిగాయి.మన దేశంనుంచి అమెరికాకు వెళ్లడానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హెచ్1బి వర్క్ పర్మిట్, ఎఫ్1 స్టూడెంట్ వీసా, హెచ్4 డిపెండెంట్ వీసా, హెచ్3 వీసా, 01 వీసా, పి వీసా, ఆర్1 రెలీజియన్ వీసా ఈ విధంగా నాన్ ఇమిగ్రెంట్ వీసాల ద్వారా అమెరికాకు వెళ్తుండటం పరిపాటిగా వస్తోంది. అయితే ఇప్పుడు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇకపై మరో దేశంలో ఇంటర్వ్యూకు హాజరయ్యే అవకాశం లేదని తాజా నిబంధనలు చెబుతున్నాయి. వీరు తమ స్వదేశంలోనే అమెరికా ఎంబసి, కాన్సులేట్లో మాత్రమే ఇంటర్వ్యూ అపాయింట్మెంట్ కోసం షెడ్యూల్ చేసుకోవాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కొవిడ్ సమయంలో భారత్లో వీసా అపాయింట్మెంట్ కోసం దాదాపు మూడేళ్ల కాలం ఎదురు చూడవలసి వచ్చేది. దీంతో చాలా మంది భారతీయులు థాయ్లాండ్, సింగపూర్, జర్మనీ, బ్రెజిల్ వంటి దేశాలకు వెళ్లి త్వరగా వీసాలు పొందేవారు. ఇప్పటికే భారత్లో బీ1, బీ2 వీసాల ఇంటర్వ్యూలకు సుమారు మూడున్నర నెలల సమయం పడుతోంది. కొత్త నిబంధనల వల్ల ఎన్ని నెలలు పడుతుందో చెప్పలేం. ఇలాంటి కఠినతర ఆంక్షల కారణంగానే హెచ్1బి వీసాదారులు ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి ఇతర దేశాలపై మొగ్గు చూపడం ప్రారంభమైంది.